# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 63 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 24 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 63 24-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల

అమరావతి ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్‌ను ఏపి ఇంటర్ బోర్డ్ బుధవారం విడుదల చేసింది. మే 22 నుండి 29 తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య వెల్లడించారు.



- తరువాయి 2లో..

## నేర రాజకీయాలు చేసే వారిని
# ఉపేక్షించం..

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- హత్యకు గురైన ప్రకాశం జిల్లా నేత వీరయ్య చౌదరి భౌతిక కాయానికి నివాళులర్పించిన సిఎం





ఒంగోలు ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గత ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో హత్య రాజకీయాలు పెరిగిపోయాయని, అటువంటి సంస్కృతి నుండి బయటపడుతున్న తరుణంలో కొందరు రాజకీయ దుష్ట శక్తులు హత్యలకు పాల్పడడం గర్హనీ నియమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు శాంతి భద్రతల పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తున్న వేళ అక్కడక్కడ అశాంతిని

- తరువాయి 2లో..



## ఉగ్రదాడి మృతులకు సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో నిన్న జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన ఏపీ తెలుగు సంఘం సభ్యులు జేఎస్ చంద్రమౌళి, మధుసూదన్‌లకి సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు. ఈ తీవ్ర దుఃఖ సమయంలో తమ ఆలోచనలు, ప్రార్ధనలు వారి కుటుంబాలకు అండగా ఉన్నాయని, ఈ అపారమైన నష్టాన్ని తట్టుకునే శక్తిని వారు పొందాలని తాను ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. ఉగ్రవాద చర్యలు సమాజానికి మచ్చ అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఉగ్రవాదం, హింస వారు ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల ఏదీ సాధించ లేరని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంఘీభావంగా నిలుస్తోందని తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు తీవ్రవాదంపై ధృఢమైన, నిర్ణయాత్మక చర్యతో ప్రతిస్పందించడానికి తమ నిబద్ధతతో ఉన్నారని చెప్పారు. ఈ హేయమైన చర్యకు బాధ్యులైన వారిపై కఠినంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు అన్నారు.

**వీరయ్య చౌదరికి నివాళి**

ఒంగోలు జిల్లా టీడీపీ నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళులు అర్పించారు. బుధవారం చంద్రబాబు ఒంగోలు వచ్చి వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను

- తరువాయి 2లో..



## ఏపీ టెన్త్ పరీక్షల ఫలితాలు విడుదల
# బాలికలదే హవా

అమరావతి ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం ఉదయం 10 గంటలకు విడుదల అయ్యాయి. ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేష్ ఫలితాలను సోషల్ మీడియా ఎక్స్ వేదికగా విడుదల చేశారు. ఈ ఏడాది 6,14,459 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 4,98,585 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని మంత్రి వెల్లడించారు. 81.14 శాతం ఉత్తీర్ణత సాధించారని, పార్వతీపురం మన్యం జిల్లా 93.90 శాతం ఉత్తీర్ణత రేటుతో అగ్రస్థానంలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో 1,680 పాఠశాలలు 100 శాతం ఫలితాలను సాధించాయన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ పరీక్షల్లో ఫెయిల్ అయినవారు నిరుత్సాహపడవద్దని సూచించారు. జీవితం రెండవ అవకాశాన్ని అందిస్తుందని అన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 19వ తేదీ నుండి 28 వరకు జరుగుతాయన్నారు. ఇది విజయం సాధించడానికి మరొక అవకాశాన్ని అందిస్తుందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ఈ ఫలితాలను

- తరువాయి 2లో..



## 3 రోజులు సంతాప దినాలు
### జనసేన అధినేత పవన్‌కల్యాణ్

అమరావతి ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాప సూచకంగా రాష్ట్రంలో మూడు రోజులు సంతాప దినాలను పాటిస్తున్నట్లు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. పహల్గాం ఉగ్రదాడి తనను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. ఉగ్రవాద దుశ్చర్యలతో ప్రాణాలు కోల్పోయిన రెండు కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టాలని, మృతుల కుటుంబాలకు సంఘీభావంగా మానవహారం నిర్వహించాలని కోరారు.



## నేటి నుండి పాఠశాలలకు
# వేసవి సెలవులు



గుంటూరు ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గుంటూరు జిల్లాలోని పాఠశాలలన్నింటికీ ఈ నెల 24 నుంచి సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి రేణుక ఒక ప్రకటనలో తెలిపారు. జూన్11వ తేదీ వరకు సెలవులు ఉంటాయని, 12న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని చెప్పారు. ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోనోపాధ్యా యులు ప్రధానోపాధ్యాయులు పాటించాలని సూచించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు..ప్రకటించారు



## ప్రధాని మోదీ పర్యటనకు
# పటిష్ట ఏర్పాట్లు

### అధికారులకు మంత్రి - నారాయణ సూచనలు

అమరావతి ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో మంత్రి నారాయణ చర్చించారు. ప్రధాని పర్యటన దృష్ట్యా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. రాజధాని అమరావతి ప్రాంతంలో బుధవారం నాడు మంత్రి నారాయణ పర్యటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏపీ రాజధాని

- తరువాయి 2లో..

## బిగ్ బాస్ బండారం
# బయటపెడతాం

-ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు
-ఒక్కో ఇటుక పేర్చుకుంటూ రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం నిర్మిస్తోంది
-అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వ లేక వైసీపీ కుట్రలు
-మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరిక



మచిలీపట్నం ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రజాస్వామ్య దేశంలో ప్రజల హక్కుల్ని హరించి, అడ్డగోలుగా తప్పులు చేసిన వారు ఏదో ఒక రోజు చట్టం ముందు దోషిగా నిలబడడం తధ్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. మచిలీపట్నం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "వైసీపీ నేతల ఐదేళ్ల అరాచకాలన్నీ

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం దినపత్రిక

# తిరుపతిలో ఫుడ్‌సేఫ్టీ ల్యాబ్ ఏర్పాటు



**అమరావతి ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**
ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో ఫుడ్?సేఫ్టీ ల్యాబ్?ను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆహార కల్తీల గుర్తింపు, వాటి నియంత్రణకు సంబంధించి ఇప్పటివరకు వాటి నమూనాలను ఎంతో వ్యయప్రయాసలకోర్చి హైదరాబాద్‌కు పంపాల్సి వచ్చేది. అనంతరం ఫలితాలు సైతం ఆలస్యంగా రావడంతో చర్యలు తీసుకునేలోగా పుణ్యకాలం పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సైతం నమూనాల స్వీకరణకు నిరాకరిస్తుండటంతో ఐదు రాష్ట్ర స్థాయి ఫుడ్ సెఫ్టీ ల్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. తిరుపతిలో ఒకటి, తిరుమలలో టీటీడీ కోసం ప్రత్యేకంగా మరో ల్యాబ్ కేటాయించడం విశేషం. తిరుమలలోని ప్రయోగశాలను టీటీడీ అవసరాల కోసమే నిర్దేశించగా తిరుపతిలోని ప్రయోగశాలను రాయలసీమ అవసరాల కోసం వినియోగించనున్నారు. తిరుమలలో 12 వేల చదరపు అడుగుల భవనాన్ని టీటీడీ ఆహార భద్రతాధికారులకు అప్పగించగా రాష్ట్రంలో తొలి ప్రయోగశాల ఇక్కడే ప్రారంభించనున్నారు. టీటీడీకి చెందిన శ్రీదేవి కాంప్లెక్స్‌లో ప్రయోగశాల ఏర్పాటుకు అవసరమైన భవనాన్ని అద్దెకు తీసుకున్నారు.

## సంపాదకీయం

# సంక్షోభంలో విశ్వవిద్యాలయాలు

నేడు ప్రపంచ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు సంక్షోభంలో వున్నాయి. నిజానికి ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన హార్వర్డ్, కొలంబియా యూనివర్సిటీలు కూడా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అధిపత్య, సామ్రాజ్య వాద చర్యలకు గురికావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కొలంబియా యూనివర్సిటీలో అంబేద్కర్ ఎంతో స్వేచ్ఛను అనుభవించిన విషయం ఆయన జీవన గాథల్లో వ్యక్తం అవుతుంది. అమెరికాలోని హార్వర్డ్, కొలంబియా విశ్వవిద్యాలయాల్లో విద్యతో పాటు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం వెల్లివిరిసినట్లు మనకు చరిత్ర చెబుతున్న సత్యం. ఇక్కడ ప్రపంచంలోని ఎందరో మేధావులు, శాస్త్రవేత్తలు, జ్ఞానవంతులు, సాంకేతిక నిపుణులు తయా రయ్యారు. అనేక దేశాల్లో అత్యున్నతంగా చదువుకున్న మేధావులు పెక్కుమంది ఇక్కడ తమ జ్ఞానానికి పదును పెట్టుకున్నారు.

ట్రంప్ వర్సెస్ హార్వర్డ్

ట్రంప్ ఆదేశాలను హార్వర్డ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు అలెన్ ఎం. గార్బర్ ధిక్కరించడం పట్ల సామాజిక, రాజకీయ మేధావి వర్గం సానుకూలంగా స్పందించింది. "హార్వర్డ్ విశ్వవిద్యాలయం తన స్వాతంత్ర్యాన్ని ప్రభుత్వాధీనం చేయబోదు. తన రాజ్యాంగ హక్కు లను వదులుకోబోదు. ఏ పార్టీ ప్రభుత్వమైనా సరే విశ్వవిద్యాల యాలు ఏమి బోధించాలి, ఏ విద్యార్థులను చేర్చుకోవాలి.

ఏ సిబ్బందిని నియమించుకోవాలి, ఏ పరిశోధనలు జరపాలి అనే విషయా లను ఆదేశించజాలదు" అని గార్బర్ వ్యాఖ్యానించారు. విశ్వవిద్యా లయ వ్యవహారాల నిర్వహణలో పాలకుల జోక్యానికి ప్రతిస్పందిస్తూ ఏ భారతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఇంత నిక్కచ్చిగా మాట్లాడి ఉంటారు? ఈ ధరిత్రిపై తన కంటే శక్తిమంతుడు మరొకరు లేరని విశ్వసిస్తున్న ట్రంప్ ఆదేశాలను గార్బర్ ధిక్కరించారు.

అందుకు ఆగ్రహించిన ట్రంప్ విశ్వవిద్యాలయానికి 2.2 బిలియన్ డాలర్ల నిధుల విడుదలను నిలిపివేశారు. అయినప్పటికీ శ్వేత సౌధ ఆదేశాలను పాటించేందుకు హార్వర్డ్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది.

గత నెలలో మరో ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం కొలంబియాకు కూడా 400 మిలియన్ డాలర్లను మంజూరు చేసేందుకు ట్రంప్ నిరాకరించారు. ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆయన షరతులకు కొలంబియా సమ్మతించింది. నిజానికి విశ్వవిద్యాలయాల అధిప తులు సామ్రాజ్యాధిపతుల కంటే గొప్పవారు. వారు ఎంతో జ్ఞానాన్ని ఉత్పత్తి చేస్తుంటేనే ప్రపంచం నడుస్తుంది. అమెరికా నేడు అనేక విషయాల్లో ప్రపంచంలో ముందు ఉందంటే అందులో విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో ఉంది.

నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రజా స్వామ్యాన్ని ప్రవచించిన, స్టాలిన్ నియంతృత్వాన్ని ఎదిరించి ప్రపంచానికి ప్రజాస్వామ్యాన్ని ప్రవచించిన జాన్ డ్యూయీ వంటి ఎందరో మేధావులు ఆవిర్భవించిన కొలంబియా విశ్వవిద్యాలయం నేడు ఆంక్షలను ఎదుర్కోవడం బాధాకరమైన విషయం. "ప్రజాస్వామికం అనే భావాన్నీ, ప్రజాస్వామికం అర్థాన్నీ మనం ఎప్పటికప్పుడు కొత్తగా తరచి చూసుకుంటూ వుండాలి.

రాజకీయ, ఆర్థిక, సాంఘిక సంస్థలను కూడా దీనికి అనుకూలంగా మార్చుకోవాలి. ప్రజాస్వా మికం నిత్యనూతనం అయి, ప్రజల అవసరాలతోపాటు మారుతూ వచ్చినపుడే అది ప్రజల జీవితాన్ని ప్రతిబింబించేదీ, ప్రజలకు సహాయం చెయ్యగలిగేదీ అవుతుంది. ఈనాటి మార్పులనూ, రాబోయే మార్పులనూ తెలుసుకోటానికి అది ముందుకు నడవాలి. అది కదలకుండా నిలబడటం ఆత్మహత్య చేసుకోవటమే అవుతుంది" అని హెచ్చరించారు జాన్ డ్యూయీ. ఆయన విద్యకు ప్రధానమైన పాత్రను ఇచ్చారు. విద్య అంటే జ్ఞాన జ్యోతి, విద్య అంటే విప్లవ సంకేతం, విద్య అంటే మానవాభ్యుదయానికి మార్గం.

భారతదేశ పరిస్థితి

మన దేశంలో కూడా యూనివర్సిటీల మీద పెత్తనం అప్రజాస్వా మికంగా, లౌకిక భావజాలానికి భిన్నంగానే జరుగుతోంది. విశ్వ విద్యాలయాల గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపాన్నే మార్చే పెద్ద ప్రయత్నం జరుగుతోంది. 2023 నాటికి మనకు 1,074 విశ్వవిద్యాల యాలున్నాయి. ఇందులో 128 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు. ఇక్కడ ఒకప్పుడు లౌకికవాద, ప్రజాస్వామ్య, ఆర్థిక, సామ్యవాద, సామాజిక పరిణామవాద భావజాలం అభివృద్ధి చెందింది. జీవశాస్త్రం, పదార్థ శాస్త్రం, రసాయన శాస్త్రంలో ప్రపంచానికే జ్ఞానసంపత్తిని అందించ గల్గిన పరిశోధనలు వచ్చాయి.

దళిత బహుజన విద్యార్థులకు మెరు గైన స్కాలర్‌షిప్‌లు లభించాయి. దళిత బహుజన మైనారిటీల నుండి కూడా ఎంతో నూత్న జ్ఞానం ఆవిర్భవించింది. జేఎన్ యూ, ఢిల్లీ విశ్వ విద్యాలయం, జామియా మిలియా, ఏఎన్‌యూ, జాదవపూర్, జమ్ము సెంట్రల్ వర్సిటీల్లో (వాటి అధ్యాపకులు, విద్యార్థులు) ఎంతో విలువైన పరిశోధనలు చేశారు. జేఎన్‌యూలో ఇమ్మానుయేల్ కాంట్, హెగెల్, కారల్ మార్క్స్ గురించిన విస్తృతమైన అధ్యయనాలు జరిగాయి.

సబాల్టర్న్ స్టడీస్‌లో భాగంగా హిస్టరీలో అత్యంత విలువైన విషయాలను ముందుకు తెచ్చిన రొమిల్లా థాపర్ జేఎన్‌యూలో చరిత్ర బోధకురాలని మరువరాదు. కానీ నేడు దేశంలో మత గ్రంథాల్లోని పురాణ కథలను పాఠ్య గ్రంథాలుగా తెచ్చే పెద్ద ప్రయత్నం జరుగుతోంది. భారతీయ విశ్వ విద్యాలయాలకు ప్రభుత్వ ప్రోత్సాహం చాలా తక్కువగా వుంది. ట్రంప్ సామ్రాజ్యవాదాన్ని విమర్శిస్తున్న భారత మేధావులు కేంద్ర ప్రభుత్వ చర్యలను సమర్థించడం ఆశ్చర్యాన్ని గొలుపుతోంది.

నిజానికి ప్రపంచ వ్యాప్తంగా విద్యా వ్యాపారం ఎక్కువగా జరుగుతోంది. భారతదేశంలో ఎక్కువ ధనం విద్యకే ఖర్చవుతోంది. అయినా ఉపాధి రంగాలు లేక ఇతర దేశాలకు వలస వెళ్ళిపోతు న్నారు. ఇప్పుడు భారత పాలకులకు, రాష్ట్రాలను పాలించే ముఖ్య మంత్రులకు ఈ దేశంలో ఉన్న మానవ వనరులను, మానవ శక్తిని ఎలా సమన్వయించాలో తెలియక ఇతర దేశాలకు ఉపాధి రంగాల కోసం విద్యార్థులను వెళ్ళమని పురమాయిస్తున్నారు. ఇతర దేశాలకు వెళ్ళడం తప్పు కాదు. దేశంలో ఉన్న విద్యను, విద్యా మూలాలను దెబ్బతీసుకోవడం వలన వనరుల మీద ఆసక్తి తగ్గిపోతుందనేది మనం అర్థం చేసుకోవాల్సిన విషయం.

విద్యకు హద్దులా?

ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు పాలకవర్గ సామ్రాజ్య వాద, పెట్టుబడిదారీ, మతోన్మాద భావజాలాల ఒత్తిడిలో వున్నాయి. సరైన గ్రాంట్స్, స్కాలర్‌షిప్‌లు లేక విలవిల్లాడుతున్నాయి. తెలంగాణలో సెంట్రల్ విశ్వవిద్యాలయ భూములను ఆక్రమిస్తున్నారు. విశ్వవిద్యాలయాలు కులాధిపత్య భావాల మధ్య నలుగుతున్నాయి. భారతదేశంలో జీవించలేక, ఉపాధి లేక, స్వేచ్ఛ లేక ఇతర దేశాలకు వెళుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో అమె రికా విధిస్తున్న ఆంక్షలు గొడ్డలిపెట్టుగా ఉన్నాయి.

ఆసియా దేశాలు తమ స్వీయ విద్యోత్పత్తి, జ్ఞానోత్పత్తి విషయంలో స్వయంకృషికి పూనుకోవలసిన అవసరం వుంది. విద్య మానవుని వికాసానికి సోపానం. ఉన్నత విద్య ప్రపంచ జీవన వ్యవస్థ లను పునరుజ్జీవింపజేయగల శక్తిని కలిగి వుంటుంది. హార్వర్డ్, కొలంబియా, భారతీయ విశ్వవిద్యాలయాల పునరుజ్జీవన ఉద్యమం అత్య వసరం. ప్రపంచంలో విశ్వ మానవులైన వారందరూ విద్య ద్వారా, జ్ఞానం ద్వారా మాత్రమే అయ్యారు. సామ్రాజ్యానికి ఎల్లలుంటాయి. పాలనకు హద్దులు వుంటాయి. కానీ విద్యకు హద్దులుండవు.

విద్య గురించి అంబేద్కర్ మాట్లాడుతూ, "ఏ విద్య అయితే సమర్థతను సమున్నతంగా పెంచలేదో, సమానత్వాన్ని పెంపొందించుకోవడానికి బాధ్యత వహించదో, నీతికి భూమికగా నిలువదో అది విద్యకాదు. విద్య అనేది మానవ సంక్షేమానికి రక్షణగా, శక్తిమంతంగా, బహుళ ప్రయోజనకారిగా సమతానురాగాల మూలస్థానంగా ఉండాల"న్నారు. విద్యావంతమైన జాతి దానంతటదే అభివృద్ధిలోకి వస్తుంది. అంబే డ్కర్ ఆలోచనలే ప్రపంచ విశ్వవిద్యాలయాల వికాసానికి మార్గం.

# నేర రాజకీయాలు చేసే వారిని ఉపేక్షించం

నెలకొల్పాలనే దురుద్దేశంతో కొందరు రాజకీయ నేతలు చేస్తున్న కుటిల యత్నాలను తిప్పి కొడతామని ముఖ్యమంత్రి అన్నారు. మంగళవారం హత్యకు గురైన ప్రకాశం జిల్లా తెదేపా నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి.. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒంగోలులో తెదేపా నేత వీరయ్య చౌదరి మంగళవారం హత్యకు గురైన విషయం తెలిసిందే. దీంతో నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలుకు చేరుకున్న సీఎం చంద్రబాబు.. వీరయ్య చౌదరి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సీఎం వెంట మంత్రులు అనిత, ఆనం, డోలా, ఎంపీ మాగుంట, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ హత్యా రాజకీయాలు చేసి తమ పబ్బం కడుపుకోవాలనుకునే వారి ఆటలు ఇక సాగవు అని తేల్చి చెప్పారు రౌడీ రాజకీయాలు, రాజకీయ ద్వేషాలతో తెలుగుదేశం పార్టీ నాయకుల జోలికి వస్తే సహించేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు రాష్ట్రంలో ఎక్కడైనా ఎవరైనా హత్యా రాజకీయాలకు పాల్పడితే ఇకపై వారి భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరించారు మంగళవారం జరిగిన వీరయ్య చౌదరి హత్య ఉదంతంలో దుండగులు 53 సార్లు అత్యంత కిరాతకంగా కత్తులతో పొడిచి హత్య చేయడాన్ని తాను సహించలేనని ఇటువంటి నేరాలను చేసే వ్యక్తులను ఎక్కడ దాక్కున్నా పట్టుకొని తీరుతామని కఠినంగా శిక్షిస్తామని చంద్రబాబు ప్రకటించారు ఇలాంటి ఘోరాలు చేసే నేరస్తుల్ని ఉపేక్షించబోమని అటువంటి వారు భూమ్మీద జీవించడానికి అర్హులు కాదన్నారు వీరయ్య చౌదరి హత్య కేసులో నిందితుల గాలింపు కోసం 12 బృందాలు దర్యాప్తు జరుగుతున్నాయని తెలిపారు ఇటువంటి నేర రాజకీయాలు చేసేవారి సమాచారాన్ని పోలీస్ శాఖకు అందజేయాలని చంద్రబాబు కోరారు ఈ హత్య కేసులో ప్రమేయం ఉన్న వారిని పోలీస్ శాఖ వెంటాడి శిక్షించి తీరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భరోసా కల్పించారు ఎవరి వద్దనైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 9121104784 నంబర్కు సమాచారము ఇవ్వాలని సూచించారు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాయని అన్నారు. రాష్ట్రంలో రాజకీయ దాడులు హత్యలకు తమ ప్రభుత్వం చెక్ పెడుతుందని ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నట్లు అన్నారు మాజీ ఎంపీపీగా వీరయ్య చౌదరి తెలుగుదేశం పార్టీ నాయకునిగా ఈ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం కృషి చేశారన్నారు, అటువంటి నేతను కొందరు హత్య చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు వీరయ్య చౌదరి మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన యువ గళం పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొని పార్టీ కోసం పని చేశారని కొనియాడారు అటువంటి నాయకుల త్యాగం పార్టీ ఎన్నటికీ మరువదని వారికి వారి కుటుంబాలకు అండగా ఉంటుందని పేర్కొన్నారు రాష్ట్రంలో ఇలాంటి అరాచక శక్తులు తమ మేర స్వభావాన్ని మార్చుకోవాలని లేని పరిస్థితుల్లో రాష్ట్రం నుండి తరిమి వేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు.

# ఉగ్రదాడి మృతులకు సీఎం చంద్రబాబు సంతాపం

పరామర్శించారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నేరుగా గన్నవరానికి చేరుకున్న సీఎం చంద్రబాబు ఆ తర్వాత గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో సీఎం చంద్రబాబు విశాఖపట్నం వెళ్లారు. గురువారం ఉదయం ఉగ్ర దాడిలో మరణించిన చంద్రమౌళి అంత్యక్రియల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. గురువారం సాయంత్రం విశాఖపట్నం నుంచి అమరావతికి సీఎం చంద్రబాబు తిరిగి రానున్నారు.

**ఉగ్రదాడి తీవ్రంగా కలిచి వేసింది: మంత్రి నారాయణ**

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడి దారుణ సంఘటన అని, ఈ దాడి తీవ్రంగా కలిచి వేసిందని మంత్రి నారాయణ తెలిపారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూధనరావు మృతి చాలా బాధకలిగించిందని అన్నారు. మధుసూదనరావు మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఉగ్రదాడిలో మృతులకు నివాళులు అర్పిస్తున్నామని మంత్రి నారాయణ అన్నారు.

**ఉగ్రదాడి అమానుషం: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

నెల్లూరు, ఏప్రిల్ 23(గోదావరి ప్రతినిధి): జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడి దారుణ సంఘటన అని, ఈ దాడి తీవ్రంగా కలిచివేస్తుందని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అమాయకుల ప్రాణాలు పొట్టన పెట్టుకోవడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు ఉండటం చాలా బాధిస్తుందని అన్నారు. వారి కుటుంబానికి కూటమి ప్రభుత్వం, తామంతా అండగా ఉంటామని తెలిపారు. ఉగ్రదాడిలో మృతులకి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాళులు అర్పించారు.

**ఉగ్రదాడి తీవ్రంగా కలిచివేసింది: ఎంపీ వేమిరెడ్డి**

జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ట్రెక్కింగ్‌కి వెళ్లిన టూరిస్టులపై కాల్పులు జరిపి హతమార్చడం తీవ్రంగా కలిచివేసిందని చెప్పారు. ఉగ్రదాడి పిరికిపంద చర్య అని తెలిపారు. మృతుల కుటుంబాలకి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

**ఉగ్రదాడి కుటుంబాలకు అండగా ఉంటాం: మంత్రి నిమ్మల రామానాయుడు**

పహాల్గం ఉగ్రదాడిలో మరణించిన చంద్రమౌళికి మంత్రి నిమ్మల రామానాయుడు నివాళులు అర్పించారు. చంద్రమౌళి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఉగ్రదాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

**ఆ ఘటన తీవ్రంగా కలచివేసింది: ఎంపీ అప్పలనాయుడు**

కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశాఖపట్నం వాసి చంద్రమౌళి మరణించిన ఘటన తీవ్రంగా కలచివేసిందని విజయనగరం తెలుగుదేశం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఈ దుఃఖ సమయంలో బాధిత కుటుంబానికి సానుభూతిని తెలిపారు. ఈ ఘటన గురించి తెలియగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సంప్రదింపులు జరిపారని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సూచనల మేరకు, మన రాష్ట్ర ఎంపీలు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఘటనను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.

# ఏపీ టెన్త్ పరీక్షల ఫలితాలు విడుదల

https://bse.ap.gov.in, https://apopenschool.ap.gov.in/, మనమిత్ర వాట్సాప్, లీప్ యాప్‌లోనూ విద్యార్థులు ఫలితాలు చూసుకోవచ్చు. అలాగే వాట్సప్ నంబర్ 9552300009కు హాయ్ అని మెసేజ్ చేసి, విద్యా సేవల ఆప్షన్ ద్వారా ఫలితాలను పీడీఎఫ్ కాపీ రూపంలో పొందవచ్చు. ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాలు కూడా టెన్త్ ఫలితాలతో పాటే విడుదల చేశారు. విద్యార్థులు తమ మొబైల్ ఫోన్‌లోని వాట్సాప్‌లో 9552300009 నంబర్‌కు '%ుఱ%' అని మెసేజ్ చేయాలి. వెంటనే సేవను ఎంచుకోండి అనే ఆప్షన్ వస్తుంది. అందులో విద్యా సేవలను ఎంచుకోవాలి. అనంతరం ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల ఫలితాలను సెలక్ట్ చేసుకోవాలి.. అక్కడ రోల్ నంబర్‌ను ఎంటర్ చేయడం ద్వారా ఫలితాలు డిస్‌ప్లే అవుతాయి. ఈ రిజల్ట్ పీడీఎఫ్ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలాగే.. పదో తరగతి రెగ్యులర్ పబ్లిక్ పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫలితాలను సైతం విడుదల చేశారు. ఈ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాలను %https://apopenschool.ap.gov.in%/ వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. కాగా ఈ ఏడాది 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు 6,19,275 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఇంగ్లిష్ మీడియంకు సంబంధించి 5,64,064 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. తెలుగు మీడియంలో 51,069 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

# ప్రధాని మోదీ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

అమరావతిలో మే2వ తేదీన పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రధాని మోదీ సభకు వచ్చే రహదారులను పరిశీలించారు. గుంటూరు, ఏలూరు, విజయవాడ ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రజలకు సంబంధించి రహదారి మార్గాల విషయంలో అధికారులకు మంత్రి సూచనలు చేశారు. కొన్ని రోడ్లు వెంటనే వెడల్పు చేయాలని మంత్రి నారాయణ ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. రాజధాని ప్రాంతంలో రూ.64 వేల కోట్ల విలువైన టెండర్లు పిలిచామని మంత్రి నారాయణ తెలిపారు. వచ్చే నెల 2వ తేదీన మళ్లీ రాజధాని పనులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రీ లాంచ్ జరుగుతుందని చెప్పారు. వచ్చే నెల 2వ తేదీన ప్రధాని మోదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారని అన్నారు. 5 లక్షల మంది ప్రజలు బహిరంగ సభకు హాజరవుతారనే అంచనా వేస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

రాజధానిలో కొన్ని రోడ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని మంత్రి నారాయణ అన్నారు. పోలీసుశాఖ సమన్వయంతో సీఆర్డీఏ సిబ్బందితో రాజధాని ప్రాంతంలో పర్యటన చేశామని తెలిపారు. 8 రోడ్డు మార్గాల్లో సభకు చేరుకోవచ్చని అన్నారు. తాడికొండ, హరిశ్చంద్రపురం, ప్రకాశం బ్యారేజ్ ఇలా కొన్ని మార్గాల్లో సభకు చేరుకునే విధంగా ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. 11 ప్రాంతాల్లో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని అన్నారు. ప్రధాని హెలీప్యాడ్‌లో దిగిన తర్వాత సెక్యూరిటీ సూచనల ప్రకారం ఒక కిలోమీటర్ వరకు రోడ్ షో ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు.

# బిగ్ బాస్ బండారం బయటపెడతాం

ఒక్కొక్కటి బయటపడుతుండడంతో.. కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు కుట్రలు చేస్తున్నారు. ఈస్కాములో ఉన్న అసలు బిగ్ బాస్ గుట్టు కూడా త్వరలోనే బయట పెడతాం. మద్యం స్కాం వెనుక చాలా మంది హస్తం ఉందని కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుండి చెబుతూనే ఉన్నాం. ఇప్పటికే స్కాం వివరాలను శ్వేతపత్రం ద్వారా బయటపెట్టాం. నిన్నటి వరకు వైసీపీలో నెం.2గా ఉన్న విజయసాయిరెడ్డి మద్యం స్కాం రాకెట్ మొత్తాన్ని బయటపెట్టడంతో వైసీపీ నేతల వెన్నులో వణుకు మొదలైంది. ఇదే కేసులో రాజ్ కసిరెడ్డి అరెస్టయ్యారు. అయినా వైసీపీ నేతలు సిగ్గులేకుండా రాద్ధాంతం చేస్తున్నారు. అరెస్టులను రాజకీయం చేయాలని చూస్తున్నారు" అని మండిపడ్డారు. "ఎందెందు వెతికినా అందందు స్కాములే అన్నట్లుగా.. వైసీపీ పాలన సాగిందని ఎద్దేవా చేశారు. వారి స్కాములన్నీ బయటకు వస్తుండడంతో గో మరణాలంటూ నిన్నటి వరకు రాద్ధాంతం చేశారు. పరిశీలనకు రావొచ్చని చెప్పగా తోకముడిచారు. కోట్లాది మంది ఇలవేల్పుగా భావించే వెంకటేశ్వర స్వామిని నల్లరాయి, చెప్పులేస్తే తప్పేంటి అన్న కరుణాకర్ రెడ్డి ఇప్పుడు తిరుమలపై రాజకీయం చేస్తున్నాడు. వక్ఫ్ చట్టానికి రాజ్యసభలో మద్దతిచ్చు బయటకొచ్చి వ్యతిరేకం అంటున్న వైసీపీ రాజకీయంపై అసహ్యం కలుగుతోంది. ప్రజలు ఛీ కొట్టినా దొంగ నాటకాలు, వీధి పోరాటాలు హేయం. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో నాశనమైన రాష్ట్రాన్ని ఒక్కో ఇటుక పేర్చుకుంటూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. పోలవరం, అమరావతి సహా నదుల అనుసంధానానికి నాడు శ్రీకారం చుడితే.. జగన్ రెడ్డి నిలిపివేశాడు. అమరావతికి కులం ముద్ర వేసి నాశనం చేయాలనుకున్నాడు. పోలవరంపై అవినీతి ఆరోపణలు చేసి విధ్వంసం చేశాడు. అన్నీ నాశనం చేసి రుషికొండపై ప్యాలెస్ కట్టుకున్నాడు. దాన్ని ఏం చేయాలో అర్థం కాని దుస్థితి నెలకొంది. కూటమి అధికారంలోకి రాగానే అమరావతి, పోలవరం నిర్మాణాలను వేగవంతం చేసింది. వారి అసమర్థత కారణంగా నిర్మాణ వ్యయం పెరిగింది. దాన్ని కూడా రాజకీయం చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు " అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ఇంటెలిజెన్స్ డీజీగా పని చేసిన వ్యక్తి చట్టాన్ని మీరి నాటి ఎంపీపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ముంబైకి చెందిన ఒక సినీ నటిని చిత్రహింసలు పెట్టారు. అధికారం ఉందని విర్రవీగితే చట్టం చూస్తూ ఊరుకోదు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే వాళ్లను వదిలేయాలని వైసీపీ వారి ఆరాటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆడబిడ్డల విషయంలో తప్పుగా ప్రవర్తిస్తే ఎవరైనా ఒకటే. ఎవరినీ వదిలి పెట్టే ప్రశక్తే లేదు. కానీ.. జగన్ రెడ్డి మాత్రం టీడీపీ నేతలపై హత్యాయత్నం చేసినోడికి మున్సిపల్ ఛైర్మన్ పదవి, చంద్రబాబు ఇంటిపై దాడికి ప్రయత్నించిన వ్యక్తికి మంత్రి పదవి ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అంటేనే క్రమశిక్షణ, నిబద్ధత. ప్రజల కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం. ప్రజలు మెచ్చేలా రాష్ట్రంలో పాలన సాగుతోంది. ఇలాంటి ప్రభుత్వంపై నిందలేయాలని, ఆరోపణలు చేయాలని చూస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరు" అని రవీంద్ర హెచ్చరించారు. "దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వని విధంగా ఏపీలో సంవత్సరానికి రూ.33 వేల కోట్లను పెన్షన్లుగా అందిస్తున్నాం. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేశాం. నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని ప్రయత్నిస్తున్నాం. తాజాగా 16వేల టీచర్ పోస్టులతో డీఎస్సీ ప్రకటించాం. రాష్ట్రాన్ని సుభిక్షం చేసేందుకు కూటమి అడుగులు వేస్తోంది. ఐదేళ్లు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా డ్రామాలాడిన జగన్ రెడ్డికి ఉద్యోగాల భర్తీ గురించి మాట్లాడే కనీస అర్హత లేదని గుర్తుంచుకోవాలి. దొంగే దొంగ దొంగ అని అరచినట్లుగా పేర్నినాని వ్యవహారం ఉంది" అని మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. "పేదల బియ్యాన్ని పందికొక్కులా దొక్కేసినోళ్లు ఎక్కడో ఏదో జరిగిపోతోందంటూ గోల చేస్తున్నాడు. ఎవరి హయాంలో మట్టి దోపిడీ జరిగిందో ప్రజల్ని అడిగేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. గోదాముల నిర్మాణానికి మట్టి ఎక్కడి నుండి తోలావో సమాధానం చెప్పాలి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేదల భూముల్ని అడ్డగోలుగా దోచుకుతిన్నవారు ఇప్పుడు నిందలేయడం హేయం. ఫిషింగ్ హార్బర్‌కు నిధులిచ్చింది మేము. బందరు పోర్టుకు భూ సేకరణ చేసి పనులు ప్రారంభించింది మేమే. విజయవాడ మచిలీపట్నం రోడ్డు నిర్మించింది మేమే. గత ఐదేళ్లలో అధికారుల్ని బెదిరించడం, ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడం తప్ప సాధించిందేమీ లేదు. తప్పు చేసినోళ్లను వదిలిపెట్టే ప్రశక్తే లేదు" అని హెచ్చరించారు.

"కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా గుంతలు లేని రోడ్లను సాకారం చేశాం. ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు అందించేలా పనులు చేస్తున్నాం. అభివృద్ధి చేసేవాళ్లపై బురద జల్లుతామంటే ప్రజలంతా ఏకమై తగిన ఫలితం చూపిస్తారని హెచ్చరించారు. మచిలీపట్నం సంస్కృతిని చాటి చెప్పేలా ఏర్పాట్లు చేస్తున్నాం. డ్రైనేజీలన్నింటిలో కూడా సిల్టు తొలగింపునకు టెండర్లు పిలిచాం. మురికి కాల్వల్ని శుభ్రం చేస్తాం. మున్సిపల్ కార్యాలయం, బేబీ సెంటర్, పాత రైతు బజార్ సీఎస్ఆర్, పిపిపి పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించాం. శ్మశాన వాటికల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. చిలకలపూడి శ్మశానాన్ని అభివృద్ధి చేసేందుకు గ్రీన్ కో సంస్థ ముందుకు వచ్చింది. ఇక్కడి నుండి వెళ్లి దేశ విదేశాల్లో స్థిరపడిన వారు కూడా సొంత ప్రాంత అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం. డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించి ఆ ప్రాంతంలో పార్కు ఏర్పాటు పనుల్ని అక్టోబర్ 2 నాటికి పూర్తి చేయబోతున్నాం. పి4 కార్యక్రమం ద్వారా పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి బాటలో నడిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మచిలీపట్నం అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములవ్వాలి. బందరుకు నయా రూపాన్ని సంతరించేందుకు తోడుగా నిలవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు కూడా ఇదే టైం టేబుల్ వర్తిస్తుందని అన్నారు. జూన్ 3 నుంచి 6వ తేదీ వరకు రెండు సెషన్లలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు. జూన్ 9న ప్రథమ ఇంటర్, 10న ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు ఏప్రిల్ 30 తుది గడువని కార్యదర్శి కృష్ణ ఆదిత్య పేర్కొన్నారు.

# బిహార్ ఎన్నికలు... ఎన్నెన్నో ప్రశ్నలు!

**బిహార్ రాష్ట్రం 13 కోట్ల జనాభాకు నెలవు! సుమారు 8 కోట్ల మంది ఓటర్లు ఉన్న ఆ రాష్ట్రంలో మరో 7 నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. బిహారీల్లో అభివృద్ధి, ఉపాధి కావాలనీబీ వలసలు నియంత్రించాలనే డిమాండ్స్ పెరగడం, కొత్త పార్టీలు పుట్టుకురావడం నేపథ్యంలో పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సంస్థ అధ్యయనంలో పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.**


కేంద్ర ప్రభుత్వం 2025 బడ్జెట్‌లో బిహార్ రాష్ట్రానికి పెద్ద పీట వేసి అందరికంటే ముందుగానే బీజేపీ అక్కడ ప్రచారం మొదలుపెట్టింది. గత ఎన్నికల వరకు ఎన్డీయే కూటమిలో సీఎం నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీ (యూ)దే పైచేయిగా ఉండేది. కానీ, ఐదేళ్లలో రాజకీయ సమీకరణాలు మారాయి. బీజేపీ అగ్రవర్ణాలపై తన పట్టును కాపాడుకుంటూనే వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రెండు దశాబ్దాలుగా జేడీ(యూ) ఓటు బ్యాంకుగా ఉన్న ఓబీసీలను, దళితులను తన వైపు తిప్పుకుంది.

నితీష్ కుమార్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో, పరిపాలనా సంస్కరణలతో లబ్ధిపొందిన ఈ వర్గాలను ఆకర్షించడం ద్వారా... బీజేపీ తన 'సామాజిక' కూటమిని బలోపేతం చేసుకుంది. సామాజిక న్యాయ పోరాటంలో కీలక పాత్ర పోషించిన లోక్ జన్ శక్తి పార్టీ (ఎల్జేపీ) వ్యవస్థాపకులు రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తర్వాత ఆ పార్టీ తన బలాన్ని కోల్పోయింది. ఆ పార్టీ తమ గుర్తింపును కాపాడుకోవడానికి తీవ్రంగా పోరాడు తున్న క్రమంలో బీజేపీకి సానుకూలంగా మారింది.

వివిధ కుల సమూహాలను తనవైపు తిప్పుకోవడానికి బీజేపీ అంతర్గతంగా ప్రత్యేక వ్యూహాలను అనుసరిస్తోంది. పలు సందర్భాల్లో జేడీ(యూ)తో విభేదాలొ చ్చినా రాష్ట్రంలో దాదాపు రెండు దశాబ్దాలుగా అధికారంలో ఉండటం వల్ల బీజేపీ తన హిందూత్వ భావ జాలాన్ని బిహార్ మట్టిలో జాగ్రత్తగా నిక్షిప్తం చేయగలిగింది. హిందూ సంఘటితం చుట్టే రాజకీయాలు నడు పుతూ మొట్టమొదటిసారి ఈ ఎజెండాతోనే ఎన్నికలు నడిచేలా వ్యూహాలను రచిస్తోంది.

బడుగు, బలహీన వర్గాల ఐక్యతను కాపాడాలనే సిద్ధాంతంతో పని చేస్తున్న 'ఇండియా' కూటమికి ఇది అతిపెద్ద సవాలుగా మారబోతోంది. రాష్ట్రంలో బీజేపీ సంస్థాగతంగా బలంగా ఉంది. అలాగే ఆ పార్టీ వ్యూహాత్మకంగా సృష్టిస్తున్న హిందూ కులాల ఐక్యత ఈసారి బిహార్ ఎన్నికలను రసవత్తరంగా మార్చనున్నది. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రకారం, బీజేపీ, జేడీ(యూ), ఎల్జేపీ, హిందుస్తానీ ఆవామ్ మోర్చా పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమికి 43.17 శాతం ఓట్లు రాగాబీ ఆర్జేడీ,కాంగ్రెస్, కమ్యూనిస్టులతో కూడిన మహాగఠ్‌బంధన్ (ఎంజీబీ) కూటమికి 38.75 శాతం ఓట్లు వచ్చాయి.

ఈ ఓట్ల వ్యత్యాసం ఇకముందు కూడా కొనసాగితే ఎన్డీఏ 2025లోనూ సునాయాసంగా విజయం సాధించే అవకాశాలున్నాయి. కానీ 2020 తర్వాత వికాసషీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) మహా%ఎల%ాఠ్‌బంధన్‌లో చేరడం,



జేడీ (యూ)లో రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీ విలీనం కావడంతో ఈసారి లెక్కలు మారవచ్చు.

బిహార్‌లో 18 శాతం ఉన్న ముస్లింలు కీలక పాత్ర పోషిస్తారు. 2020లో ఎంజీబీకి 76 శాతం ముస్లిం ఓట్లు రాగా, ఎన్డీఏకు కేవలం 5 శాతమే వచ్చాయి. యాదవ్%–% ముస్లిం ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే బీజేపీ వైపు ఉన్న బీసీలను, దళితులను తనవైపు తిప్పుకోగలిగితే ఎంజీబీ గెలుపు అవకాశాలు పెరుగుతాయి. అయితే రాష్ట్రంలో పుట్టుకొచ్చిన కొత్త పార్టీలు ఎన్డీఏ%–%ఎంజీబీ కూటముల గెలుపోటములపై ప్రభావం చూపనున్నాయి.

ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే) జన్ సూరజ్ పార్టీ నుంచి ఎంజీబీకి ముప్పు పొంచి ఉంది. 2024లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలతో పాటు ప్రస్తుతం ఉన్న ట్రెండ్స్ ప్రకారం ఆయన ఇటు ఎంజీబీ, అటు జేడీ(యూ) ఓట్లను గణనీయంగా చీల్చవచ్చు. ఆయన ఆర్జేడీ, జేడీ(యూ) పార్టీలపైనే విమర్శలతో విరుచుకుపడుతుండటంతో బీజేపీకి పరోక్షంగా మేలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుల ఆధారిత రాజకీ యాలు కాకుండా అభివృద్ధి తరహా రాజకీయాలు చేస్తా నని పీకే చెప్తున్నారు.

లాలూ, నితీష్‌ల వృద్ధాప్యం, పాశ్వాన్ మరణంతో ఏర్పడిన ఖాళీని తాను భర్తీ చేయా లనుకుంటున్నారు. అయితే 243 నియోజకవర్గాల్లో నిల బెట్టడానికి బలమైన, నమ్మకమైన అభ్యర్థులు ఆయన పార్టీకి లేరు. కాంగ్రెస్ మాజీ సీనియర్ నేత ఐ.పి. గుప్తా 'ఇండియన్ ఇంక్విలాబ్ పార్టీ' ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రెండు కులాలపై ఈ పార్టీ ప్రభావం ఉండే అవకాశాలున్నాయి. ఐపీఎస్ అధికారిగా బిహార్‌లో ప్రత్యేక పనితీరు కనబర్చిన మహా రాష్ట్రకు చెందిన శివ్‌దీప్ లాండె 'హింద్ సేన' పార్టీ ఏర్పాటు చేశారు.

ఒకప్పుడు నితీష్‌కు సన్నిహి తునిగా ఉన్న ఆర్‌సీపీ సింగ్ ఆయనతో విభేదించి బీజేపీలో చేరారు. అయితే బీజేపీ %–% జేడీ(యూ) మళ్లీ పొత్తు పెట్టుకో వడంతో ఈయన 'ఆప్ సబ్‌కీ ఆవాజ్' పార్టీని నెలకొల్పారు. కుర్మీ సామాజిక నేత అయిన ఆర్పీ సింగ్ ఆ సామాజిక ఓట్లు చీల్చే అవకా శాలున్నాయి. ఈ చిన్న పార్టీలు చీల్చే ఓట్లు ఎన్డీఏ, మహాగఠ్‌బంధన్ అభ్యర్థుల గెలుపోటములను శాసించ నున్నాయి.

ఆర్జేడీ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. బీజేపీకి పెరుగుతున్న ఆకర్షణను అడ్డుకోవడానికి ఆర్జేడీ కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. ఓబీసీలను ఏకం చేయాలనీ, మైనారిటీ ఓట్లను కాపాడుకుంటూనే ఈబీసీలను, దళితులను ఎన్డీయే శిబిరం నుంచి తమ వైపు తిప్పుకోవాలనీ ఎంజీబీ లక్ష్యాలుగా పెట్టుకుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణం ఇది. మరో ఏడు నెలల్లో ఎవరు గెలుస్తారో వేచిచూడాల్సిందే!

## హెచ్ఎమ్ రమణికుమారీకి ఘన సత్కారం..



**గాజువాక ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్లో గల త్రినాధపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న రమణికుమారి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం పాఠశాల ఆవరణలో వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జి మాలినాయుడు ఆమెను ఘనంగా సత్కరించారు. పాకల పాటి రఘువర్మ ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు, జోన్ –5 పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఏప్రిల్ 28న జివిఎంసి మేయర్ పదవికి ఎన్నిక

### నోటిఫికేషన్‌ను జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్చార్జ్ కమిషనర్ ఎమ్.ఎన్.హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ పదవికి ఎన్నికను 2025 ఏప్రిల్ 28వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలను జారీ చేశారని విశాఖ జిల్లా కలెక్టర్ , జీవీఎంసీ ఇన్చార్జి కమిషనర్ ఎమ్.ఎన్.హరేందిర ప్రసాద్ మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. సదరు నోటిఫికేషన్ ప్రకారం 24.04.2025 తేదీ లోపల మేయర్ ఎన్నికల షెడ్యూల్ ను ఫారమ్–%××% ప్రకారం మహా విశాఖపట్నం నగరపాలక సంస్థకు ఎన్నికైన సభ్యులకు మరియు ఎక్స్–ఆఫీషియో సభ్యులకు మేయర్ ఎన్నికల నిమిత్తం ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని నోటీసు ఇవ్వడం జరుగునని, మేయర్ ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం తేదీ: 28.04.2025, ఉదయం 11:00 గంటలకు నిర్వహించడం జరుగునని కలెక్టర్ తెలిపారు.

## పహల్గాం ఉగ్రదాడిలో విశాఖ వాసి మృతి.. వెంటాడి మరీ కాల్చేశారు!



**విశాఖపట్నం, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో విశాఖపట్నం వాసి, విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి చంద్రమౌళి మృతి చెందారు. పారిపోతున్న ఆయన్ను వెంటాడి మరీ చంపినట్లు సమాచారం. చంపొద్దని వేడుకున్నా ఉగ్రమూకలు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. చంద్రమౌళి మృతదేహాన్ని సహచర టూరిస్ట్‌లు గుర్తించారు. సమాచారం తెలిసిన వెంటనే విశాఖపట్నం నుంచి కుటుంబసభ్యులు పహల్గాంకు బయల్దేరి వెళ్లారు.

## శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీనగర్ : జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో పర్యటకులపై జరిగిన భీకర ఉగ్రదాడిలో 28 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోయిన ఘటన నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ప్రధాని నరేంద్ర మోదీ కేంద్రమంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు కీలక ప్రకటన చేశారు. పర్యటకుల భద్రత మేరకు వారి కోసం శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు ప్రత్యేక విమానాలు శ్రీనగర్ నుంచి ముంబయి, దిల్లీకి చేరుకుంటాయని.. ఈవిషయంపై మంగళవారం హెూంమంత్రి అమిత్ షాతో మాట్లాడానని తెలిపారు.**




అవసరమైతే మరిన్ని విమానాలు నడపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులోభాగంగా మంత్రి అన్ని విమానయాన ఆపరేటర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కష్ట సమయంలో ప్రయాణికులపై భారం పడకుండా.. సాధారణ స్థాయి ఛార్జీలను వసూలుచేయాలని విమానయాన సంస్థలను ఆదేశించారు. మరణించిన వ్యక్తుల మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకొని పనిచేస్తూ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు.

జమ్మూలో ప్రస్తుత పరిస్థితుల గురించి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడుతో రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. కశ్మీర్‌లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు సురక్షితంగా తిరిగి రావడంలో సాయం చేయడానికి దిల్లీలోని ఆంధ్రభవన్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశామన్నారు. ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన విశాఖపట్నం వాసి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళి కుటుంబసభ్యులతో ఆయన మాట్లాడారు. మృతదేహాన్ని విమానంలో తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.






తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
గురువారం 24 ఏప్రిల్ 2025



# పదవ తరగతి ఫలితాలలో మండలం 96 శాతం ఉత్తీర్ణత.

**అయినవిల్లి, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మండలం 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యా శాఖ అధికారి పి శ్రీనివాస్ తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవతరగతి ఫలితాలలో ప్రగతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని చందన నేహా షణ్ముఖి 591 మార్కులు సాధించి మండలం ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. శానపల్లి లంక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని సిర్రా వర్షిత 587 మార్కులు, కొండుకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థి రాయపురెడ్డి నాగ సాయి భీమేశ్వర పవన్ 585 మార్కులు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారని పేర్కొన్నారు. మండలంలో శాసానపల్లి లంక, కొండుకుదురు, సిరిపల్లి, చింతనలంక, వీరవల్లిపాలెం, నేదునూరు, నల్లచెరువు, మాగం, కే జగన్నాధపురం, మూలపొలం, విలస గ్రామాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నట్లు తెలిపారు. ఈ పాఠశాలల పరిధిలో 616 మంది విద్యార్థులు ఉండగా 613 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు .వీరిలో 309 బాలురు ఉండగా 304 బాలికలు ఉన్నారన్నారు. వీరిలో 295 మంది బాలికలు 291 బాలురు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఆ విధంగా బాలికలు బాలురికంటే ఉత్తమ ఫలితాలు సాధించారని వివరించారు. మొత్తంగా 587 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

# పహలగామ్ లో ఉగ్రవాదుల హత్యాకాండ దుర్మార్గ చర్య



**- టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి**

**కొత్తపేట ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జమ్ము కాశ్మీర్ లోని పహలగామ్ లో ఉగ్రవాదులు జరిపిన హత్యాకాండ అత్యంత దుర్మార్గమైన చర్య అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, కొత్తపేట మండల ప్రధాన కార్యదర్శి బూసి భాస్కరరావు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను జల్లెడ పట్టాలని, ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా ఏరివేయాలని కోరారు. పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి అశ్రు నివాళులు అర్పిస్తున్నామన్నారు. మతం పేరుతో ఉగ్రవాదులు ఈ దాడి చేయడం అమానవీయం, హేయమైన చర్య అన్నారు. ఈ దాడిలో జీవితాలు కోల్పోయిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మతాలకు, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలు ఒక్కతాటిపైకి రావాలని ఉగ్రవాదుల ఘాతుకాన్ని భారతీయులందరూ తీవ్రంగా ఖండించాలని అన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సాహించే పాకిస్థాన్ లాంటి దేశాలపై కఠినమైన ఆంక్షలు విధించాలని సూచించారు.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

**కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు - లబ్ధిదారులకు పవర్ టిల్లర్లు పంపిణీ**



**రావులపాలెం, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రైతులకు అండగా ఉంటూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఆయన లబ్ధిదారులకు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన కల్లూరి వీరభద్రం, పేరవరం గ్రామానికి చెందిన రావిపాటి కాశీ విశ్వనాథం, ఆత్రేయపురం గ్రామానికి చెందిన ఇందుకూరి సూర్యనారాయణ రాజులకు సబ్సిడీపై ఈ పవర్ టిల్లర్లను అందించినట్లు ఎమ్మెల్యే సత్యానందరావు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పవర్ టిల్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాధం, కాసా విజయసాగర్, సాధనాల శ్రీనివాస్, పడాల బుల్లి కొండారెడ్డి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- బ్లాక్ స్పాట్స్ గుర్తించి భద్రత చర్యలు
- బోడిపాలెం, పలివెల బ్రిడ్జిలపై భారీ వాహనాల రాకపోకలు నిషేధం
- 20 మెట్రిక్ టన్నులు దాటిన ఇసుక లారీలపై కేసులు
- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

గత 4 ఏళ్ళలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి భద్రతా చేపట్టాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జిల్లా రహదారి భద్రతా కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం ఆయన అమలాపురం కలెక్టరేట్ లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారులు, రాష్ట్ర అంతర్గత రహదారులుపై ప్రమాదాలు పొంచి ఉన్న ప్రాంతాల్లో భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో శాఖల సమన్వయంతో ప్రమాదాలకు గల కారణాలను తెలుసుకుని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు, లైటింగ్ ఏర్పాటు ప్రమాదాలు నియంత్రించడానికి అవసరమైతే కొత్త ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం, ఉన్న వాటిని మెరుగుపరచడం చేయాలన్నారు. రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అవగాహన కార్యక్రమాలతో పాటుగా 18 సంవత్సరాలు నిండిన విద్యార్థులకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు, హెల్మెట్లు ధరించడం వంటి అంశాల్లో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అంతర్గత రహదారుల్లో 20 మెట్రిక్ టన్నులు దాటి ఓవర్ లోడ్ తో ఇసుకను సరఫరా చేసే వాహనాలపై కేసులు నమోదు చేయాలని రవాణా అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారిపై మురమళ్ళ, భట్నవిల్లి, పేరూరు జంక్షన్ల వద్ద ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. కామనగరువు వద్ద అప్రోచ్ రోడ్లు, టోల్ ప్లాజా వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కొత్తపేట మండలం బోడిపాలెం, పలివెల బ్రిడ్జిల వద్ద భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా క్రాస్ గడ్డర్లు అమర్చాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. మడికి, చెముడులంక వద్ద సర్వీస్ రోడ్లు ఏర్పాటుకు సంబంధించి పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం సహకారంతో ఎన్.హెచ్ అధికారులు ఆక్రమణల తొలగింపు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రోడ్లపై ఎటువంటి ఆక్రమణలు, ఇటుక బట్టీల నిర్వహణ కార్యకలాపాలు లేకుండా రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దాలన్నారు. టోల్ ప్లాజా వద్ద కూడా లైటింగ్ సీసీ కెమెరాలు అమర్చి నిఘా వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. రావులపాలెం గ్రామంలో ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లైఓవర్ నిర్మాణానికి వచ్చే సమావేశం నాటికి పూర్తిగా అధ్యయనం చేసి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధపరచాలని ఎన్.హెచ్ పిడి సురేంద్రనాథ్ ను ఆదేశించారు. జిల్లాలో 40 సంవత్సరాలు పైబడి శిధిలావస్థకు చేరిన వంతెనలన్నింటి స్థితిగతులపై అధ్యయనం చేసి నివేదికను రానున్న సమావేశానికి సిద్ధపరచాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రమాదాలను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కమిటీ సభ్యులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించడం, తీసుకోవాల్సిన నిర్బంధ చర్యల గురించి, గత సమావేశం మినిట్స్ పై తీసుకున్న చర్యలను ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. పోలీస్, రవాణా, మున్సిపల్ కార్పొరేషన్ తదితర శాఖల సమిష్టి కృషితో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఆర్ అండ్ బి ఎస్ఈ బి.రాము, సాంకేతిక ఇంజనీర్ సత్య, ఆర్డీవో శ్రీనివాసరావు, దుర్గారావు దొర, మున్సిపల్ కమిషనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# పదోతరగతి పరీక్షా ఫలితాల్లో రావులపాలెంలో బాలికలదే పైచేయి

- ప్రభుత్వ పాఠశాలల్లో 79.3 శాతం ఉత్తీర్ణత
- బాలికలు 84.4, బాలురు 74.3 శాతం
- మొదటి మూడు స్థానాల్లో బాలికలే




మొదటి స్థానంలో నిలిచిన వాసంశెట్టి టింపు సాయి ఇంద్రశ్రీ 577 | ద్వితీయ స్థానంలో నిలిచిన యశశ్వనీ నాగశ్రీ 576 | తృతీయ స్థానంలో నిలిచిన అత్తిలి పూజిత 575

**రావులపాలెం ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో రావులపాలెం మండలంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 79.3 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలోని తొమ్మిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 307 మంది బాలురు, 296 మంది బాలికలు వెరసి 603 మందికి ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 598 మంది హాజరు కాగా బుధవారం విడుదలైన ఫలితాల్లో 474 మంది ఉత్తీర్ణత సాధించారు. 124 మంది ఫెయిల్ అయ్యారు. 79.3 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బాలురలో 304 మందికి 226 మంది పాస్ కాగా 78 మంది ఫెయిల్ అయ్యారు. 74.3 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల్లో 294 మందికి 248 మంది పాస్ కాగా 46 మంది ఫెయిల్ అయ్యారు. 84.4 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ వివరాలను మండల విద్యాశాఖాధికారి బైర్రాజు శ్రీనివాసరాజు విలేకరులకు తెలిపారు. రావులపాలెం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన వాసంశెట్టి టింపు సాయి ఇంద్రశ్రీ మండలస్థాయిలో అత్యధికంగా 600 మార్కులకు 577 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఈతకోట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె. యశశ్వనీ నాగశ్రీ 576 మార్కులతో ద్వితీయ స్థానం, పొడగట్లపల్లి జెడ్పీ ఓరియెంటల్ ఉన్నత పాఠశాలకు చెందిన అత్తిలి పూజిత 575 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది. మండలంలో మొదటి మూడు స్థానాల్లో బాలికలే ఉండడం విశేషం. అలాగే ఊబలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పోలవరపు జ్యోతి 567, రావులపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన కరుమళ్ళ తేజశ్రీ 552, గోపాలపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కన్నా రుచిత లహరి 550, దేవరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కొండేపూడి తనూష 549, గోపాలపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఈడేపల్లి శివరామకృష్ణ 547, వెదిరేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన లంకా దుర్గా ప్రవల్లిక 434 ఆయా పాఠశాలల స్థాయిలో అత్యధిక మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. పాఠశాలల విభాగంలో చూస్తే పొడగట్లపల్లి జెడ్పీ ఓరియెంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయిలో అత్యధికంగా 95.89 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే గోపాలపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి 94.11, గోపాలపురం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల నుంచి 92.85, ఊబలంక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 87.69, ఈతకోట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 84.09, రావులపాలెం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల నుంచి 81.92, రావులపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి 75.36, వెదిరేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 63.33 అత్యల్పంగా దేవరపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 46.42 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

# రావులపాలెంలో తాటాకిల్లు దగ్ధం



**రావులపాలెం, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

రావులపాలెంలో బుధవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక తాటికిల్లు దగ్ధం కావడంతో రెండు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక పెద్ద ఆంజనేయస్వామి గుడి వీధిలోని తాటాకింట్లో అన్నదమ్ములు అడపా చంటి, అడపా తిరుపతిరావు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఇంట్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అంతా కట్టుబట్టలతో బయటపడ్డారు. కొత్తపేట అగ్నిమాపక కేంద్రం అధికారి పి. శ్రీనివాస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఫైరింజన్ సాయంతో మంటలను అదుపు చేసారు. ఈ ప్రమాదంలో పలు గృహోపకరణాలు దగ్ధం కావడంతో సుమారు రూ.1.50 లక్షల మేర అస్థి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేసారు. తారాజువ్వ పడడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలి

## బడేటి చంటి

ఏలూరు, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కేవలం ప్రజా వినతులు స్వీకరించడంతోనే సరిపెట్టకుండా వాటికి శాశ్వత పరిష్కారమార్గాలు చూపడమే ఏకైక లక్ష్యంగా శ్రమిస్తున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి చెప్పారు. దీంతో ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై మరింత నమ్మకం ఏర్పడిందని పేర్కొన్నారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బుధవారం పలువురు ప్రజా వినతులందించేందుకు చేరుకున్నారు. తనను కలిసేందుకు వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యే చంటి వారి సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. నేనున్నానంటూ వారికి భరోసా కల్పించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఒకపక్క ఇచ్చిన హామీలను అమలు చేస్తూనే మరోపక్క ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామన్నారు. దీంతో కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారమవుతూ వస్తున్నాయని చెప్పారు. ఇదేక్రమంలో భవిష్యత్తులో మరిన్ని సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆయన భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు నూటికి నూరుశాతం వినియోగించి, మాదిగల సంక్షేమం అభివృద్ధికి కృషి

## ఏపి మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ చైర్పర్సన్ డా.ఉండవల్లి శ్రీదేవి

ఏలూరు, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



యస్.సి కార్పొరేషన్ కార్యాలయంలో ఏపి మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ చైర్పర్సన్ ఉండవల్లి శ్రీదేవి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఒక రూపాయి ఖర్చు చేయలేదని ఉన్న నిధులు పక్కదారి పట్టించారని అన్నారు.ఎన్డీఏ ప్రభుత్వంలో నూటికినూరుశాతం వినియోగించి,మాదిగల సంక్షేమానికి కృషి చేసి వారిజీవితాలలో వెలుగులు నింపటమే నా ప్రథమ కర్తవ్యం అని ఏపి మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ చైర్పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు.దళితులకు నేను మేనమామను,నా ఎస్సీలు,నా ఎస్టీలు,నా బీసీలు అంటూ గత ప్రభుత్వ నేత దళితులను మోసం చేశారన్నారు.ఎన్డీఏ ప్రభుత్వం మాదిగల అభివృద్ధికి నూరుశాతం కట్టుబడి ఉందని వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో కృషి చేస్తామని చెప్పారు.డాక్టరు బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగబద్ధంగా,చట్టబద్ధంగా దశాబ్దాల కాలం నుంచి ఎస్సీలు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, స్వయం ఉపాధి, ఎస్సీ కార్పొరేషన్ కింద రుణాలు, అంబేద్కర్ విదేశీ విద్య వంటి 28 పథకాలను రద్దుచేసి, ఎస్సీ అభివృద్ధి సంక్షేమానికి తూట్లు పొడిచారన్నారు.గత ప్రభుత్వం ఎస్సీలకు రద్దు చేసిన 28 పథకాలను తిరిగి ప్రారంభిస్తున్నట్టు స్పష్టం చేశారు.మాదిగ,మాల,రెల్లి కార్పొరేషన్‌కు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని,అభివృద్ధి సంక్షేమం చేసింది శూన్యం అన్నారు.అయిదు దళిత నియోజకవర్గం మధ్య ఏర్పాటు చేసిన ప్రజా రాజధానిని నిర్వీర్యం చేసి దళితుల అభివృద్ధిని విధ్వంసం చేశారని, రాజధాని పూర్తయి ఉంటే అత్యధికంగా లబ్ధి పొందేది ఉపాధి పొందేది దళితులేనని ఆమె అన్నారు. ఎస్సీ,ఎస్టీలకు 200 యూనిట్లు విద్యుత్ ఉచితంగా అందజేస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే సర్వే పేరుతో లబ్ధిదారుల సంఖ్యను సగానికి సగం తగ్గించి దళితవాడల్లో ఉంటేనే ఉచిత విద్యుత్ అమలు అవుతుందని గత ప్రభుత్వం అవమానించిందని అన్నారు. దళితుల అభ్యున్నతికి గత ప్రభుత్వాలు ఇచ్చిన 12 వేల ఎకరాల అసైన్ భూములను లాక్కుని వేలాది దళిత కుటుంబాలు రోడ్డున పడేశారని, దళితులను బెదిరించి ఆ భూముల్లో అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వుకుని దళితుల ద్రోహిగా గత పాలకులు చరిత్ర హీనులుగా నిలిచిపోయారని అన్నారు.దళిత యువకులు వ్యాపార,పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు దోహదపడే ఎస్సీ కార్పొరేషన్ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారని, ఎస్సీలకు మూడు కార్పొరేషన్ ఏర్పాటు చేసి,ప్రభుత్వ సలహా దారులకు ఏడాదికి చెల్లించిన వేతనంలో సగం కూడా వీరికి ఖర్చు చేయలేదన్నారు.మెరిట్ ప్రకారం రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేయవలసిన మెడికల్ కాలేజ్ సీట్లను కూడా అమ్ముకుంటూ దళితులకు తీవ్ర అన్యాయం చేశారని అన్నారు.17 మెడికల్ కాలేజీల ద్వారా దళిత బిడ్డలకు దక్కాల్సిన 544 మెడికల్ సీట్లను కూడా అమ్ముకుని దళితులను డాక్టర్లు కాకుండా గత ప్రభుత్వ అధినేత అడ్డుపడ్డారన్నారు.గత ప్రభుత్వంలో ఎయిడెడ్ వ్యవస్థను నిర్వీర్యం చేయడం, విదేశీ విద్యను ఆక్షలతో ఆటకెక్కించటం, ఫీజు రీయింబర్స్మెంటు చెల్లింపులు జాప్యం చేసి దళితులకు విద్యను దూరం చేశారని అన్నారు. ఏ,బి,సి,డి వర్గీకరణ చేసి ఎన్నో ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని అన్నారు.ఉభయ జిల్లాలకు తొలివిడతగా 1740 యూనిట్లకు గాను రూ 58.60 కోట్లు మంజూరు అయ్యాయని, ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని పారదర్శంగా మంజూరు చేయటం జరుగుతుందని దళారులను నమ్మి మోసపోవద్దని ఆమె అన్నారు. టిడిపి అంటేనే మాదిగల ప్రభుత్వమని రానున్న కాలంలో సంక్షేమం,అభివృద్ధి పూర్వ వైభవం తీసుకొస్తామని చైర్పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సొసైటీ కార్యనిర్వాహక సంచాలకులు యం.ముక్కంటి, నాయకులు పొలిమేర హరికృష్ణ, మార్లపూడి పాల్ రాజు,బయ్యారపు రాజేశ్వర రావు, కొమ్ముల రాజేష్,జుంజి మోజెస్, శ్రీరామరమేష్, మహిళా నాయకులు, జిల్లా ఎస్సీ సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ సమాధులకు స్థలం ఇవ్వాలని జేసీకి వినతి

కాకినాడ ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



తుని పట్టణంలో క్రైస్తవులకు సమాధుల కోసం స్థలాన్ని కేటాయించాలని జేసీ రాహుల్ మీనాకు తుని పాస్టర్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు బోడపాటి కాంతం మంగళ వారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంతం ఆ వినతి పత్రంలో పాస్టర్ అసోసియేషన్ వారికి మరణించిన తర్వాత సమాధి చేసేందుకు స్థలం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై గతంలో తాను తుని తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చానని ఆయన ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. అందువల్ల క్రైస్తవ సమాజం కోసం తునిలో క్రైస్తవ సమాధుల నిమిత్తం స్థలం కేటాయించేలా తగు చర్యలు తీసుకోవాలని కాంతం జేసీను కోరారు.





# ఆకుల లావణ్య లక్ష్మి ఎందరికో స్ఫూర్తి, ఆదర్శం

## స్వయంగా మీ ఇంటికి నేనే వోస్తా కలెక్టర్ పి ప్రశాంతి

తాళ్లపూడి, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

దివ్యాంగత్వం చదువుకి అడ్డంకి కాదని నిరూపిస్తూ వంద శాతం దివ్యంగురాలైన ఆకుల లావణ్య లక్ష్మి ఇటివల విడుదలైన 10 వ తరగతి పరీక్షా ఫలితాల్లో 500 మార్కులకు 345 సాధించడం ద్వారా ఎంతో మందికి స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలిచారని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలియచేశారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుంచి లావణ్య లక్ష్మి తో ఫోనులో మాట్లాడి, అభినందించారు. . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, లోపాన్ని అడ్డంకి కాదని నిరూపిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలిచారని, మీ ఇంటికి స్వయంగా నేనే వోస్తా అని హామీ ఇచ్చారు. చదువు యొక్క అవశ్యకత ను గుర్తించి, పదవ తరగతి పరీక్షలలో 500 లకి 345 మార్కులు 69 (శాతం) సాధించడం ద్వారా ఎంతో మంది స్ఫూర్తి ఆదర్శం కల్పించవని పేర్కొన్నారు. మీ ప్రతిభకు తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుంది అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. చదువుని కొనసాగించాలని, తగిన ఉద్యోగ భద్రత కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. దూర విద్య ద్వారా డిగ్రీ సాధించడం పై దృష్టి సారించాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు.

# ఎస్ ఎస్ సి ఫలితాలలో భీమవరం తిరుమల విద్యార్థుల ప్రభంజనం.




భీమవరం ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో భీమవరం తిరుమల హైస్కూల్ విద్యార్థులు అత్యద్భుతమైన ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేస్తూ 100 శాతం ఉత్తీర్ణత సాధించిరని హర్షం వ్యక్తం చేశారు. ఫలితాల్లో వై. లాస్య శ్రీ సాయి - 597 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, ఎ. జె. లక్ష్మీ దివ్య - 595, బి.ఎస్. జెనీధ - 594, జి. ఎస్. ఎన్. వి. సాయి సృజిత్, పి. సుదీప్తి, పి.కార్తీక, సి. హెచ్. ధృతి శ్రీ, వి.పద్మ సాహితి, కె. కార్తీక మరియు కె. జహ్నవి - 592, జి.పి. తేజ కుమార్ మరియు కె. అవినాష్ - 591, వై. తేజ సాయి వంశీ మరియు ఎన్. పూజిత -590 మార్కులు సాధించిగా 590 పైగా మార్కులు సాధించినవారు 14 మంది, 585 పైగా సాధించిన వారు 44 మంది, 580 పైగా సాధించిన వారు 84 మంది, 570 పైగా సాధించిన వారు 170 మంది, 560 పైగా సాధించిన వారు 244 మంది, 550 పైగా సాధించిన వారు 293 మంది, 540 పైగా సాధించిన వారు 342 మంది, 530 పైగా సాధించిన వారు 388 మంది మరియు 500 పైగా సాధించిన వారు 486 మంది. విద్యాసంస్థల డైరెక్టర్స్ ఎస్. సాయిరాజు, పి. శ్రీనివాసవర్మ మరియు జి.సతీష్ బాబు మాట్లాడుతూ 596 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 596 మంది ఉత్తీర్ణులు అయ్యారని అలాగే 81.50 శాతం విధ్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని తెలియజేసారు. ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులకు, సిబ్బందికి అభినందనలు మరియు తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియచేసారు.

# పది పరీక్ష ఫలితాలలో భీమవరం తిరుమల విద్యార్థుల ప్రభంజనం




భీమవరం ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో భీమవరం తిరుమల హైస్కూల్ విద్యార్థులు అత్యద్భుతమైన ఫలితాలు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వై లాస్య శ్రీసాయి 597, మార్కులతో ప్రధమస్థానం, ఎజె లక్ష్మీ దివ్య 595, బిఎస్ జెనీధ 594, జి సృజిత్, పి. సుదీప్తి, పి కార్తీక, సిహెచ్ ధృతిశ్రీ, వి పద్మసాహితి, కె కార్తీక, కె జాహ్నవి కుమార్ 592, జిపి తేజ కుమార్, కె అవినాష్ 591, వై తేజసాయి వంశీ, ఎన్ పూజిత 590 మార్కులు సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్స్ ఎస్ సాయిరాజు, పి శ్రీనివాసవర్మ జి సతీష్ బాబు తెలిపారు. 596 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 596 మంది ఉత్తీర్ణులు అయ్యారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

# పదో తరగతి ఫలితాల్లో భాష్యం విద్యార్థులు ప్రతిభ

భీమవరం ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భీమవరం భాష్యం స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని స్కూల్ ప్రిన్సిపాల్ హనుమంత్ రావు, జోనల్ ఎడ్యుక్యూటివ్ ఆఫీసర్ శ్రీమాన్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. మేడపాటి శ్రేష్ట 595, మద్దల ఖ్యాతిశ్రీ 595, కొక్కిరిగడ్డ రితేష్ లార్సన్ 593, సంక వెంకట సాత్విక్ 593, అంగర మనోజ్ఞ, నిమ్మితి మరత అభిషేక్త 590 మార్కులతో ప్రతిభ కనబరిచారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

# పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి కలచివేసింది.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి.

ఏలూరు, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో అమాయకులు చనిపోవడం, వారిలో ఇద్దరు తెలుగువారు ఉండటం తనను కలిచివేసిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకలు దాడికి పాల్పడటం హేయమైన చర్యగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభివర్ణించారు. కాశ్మీర్ ప్రాంతంలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించేలా దాడికి తెగబడిన ఉగ్రవాదుల పట్ల కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించబోదని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. పహల్గాం ఘటనను సీరియస్ గా తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని ఎంపీ పేర్కొన్నారు. పహల్గాం ఘటన దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు ఎంపీ మహేష్ కుమార్ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఉగ్రమూకల దాడిలో చనిపోయిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు.

# ప్రథమ, తృతీయ స్థానాలలో పి. వెంకటాపురం డా. అంబేద్కర్ గురుకుల పాఠశాల

## ప్రథమ స్థానంలో శీలి ప్రైజి (572) - తృతీయ స్థానంలో శీలి సుచిత్ర ( 567)

### ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రభంజనం




కాకినాడ, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం పి వెంకటాపురం గ్రామంలో ఉన్నటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఫలితాలు సాధించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీ. సుశీల మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ పాఠశాలలో పి. వెంకటాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల లో విద్యార్థులు శీలి ప్రైజి572 మొదటి స్థానంలోనూ అలాగే శీలి సుచిత్ర 567తృతీయ స్థానంలోనూ ఉన్నారని మా పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఘనత తీసుకొచ్చినందుకు వీరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అలాగే తమ తోటి ఉపాధ్యాయ సిబ్బందికి సహచర సిబ్బందికి పాఠశాల ఇతర సిబ్బందికి తల్లి తండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు . విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రతి సంవత్సరం తమ పాఠశాలకు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కూటమి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని అలాగే ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని, గతంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మా పాఠశాలను పర్యటించి మెరుగైన సదుపాయాలు కల్పించారని అందుకు అయన కు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు, ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నరసింహారావు పేట యు.పి.హెచ్.ఎస్‌ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

## మే 10 వ తేదీ లోగా ఎన్.సి.డి సర్వే పూర్తి చేయాలి.




ఏలూరు, ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రజాఆరోగ్యంపై చేపట్టిన ఎన్ సిడి (నాన్ కమ్యూనికబుల్ డిసీజస్) సర్వేను మే 10వ తేదీ లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నరసింహారావు పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో బాగంగా హెల్త్ సర్వీసెస్ పై సమీక్షిస్తూ ఎన్.సి.డి సర్వే 3.0 గూర్చి వివరాలు అడిగితెలుసుకున్నారు. సర్వే పై మెడికల్ ఆఫీసర్ ని సమీక్షిస్తూ మే 10 వ తేదీ లోగా ఎన్.సి.డి సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే లో ఎటువంటి లోపాలు లేకుండా ఇంటింటి కి వెళ్ళి వారికి అవసరమగు పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. యు.పి.హెచ్.ఎస్ పరిదిలో ఎవరైతే తక్కువ సర్వే చేసియున్నారో వారికి షోకాజు నోటీసు ఇవ్వాలని డి.ఎం.హెచ్.ఒ ని ఆదేశించారు. కార్యక్రమంలో యు.పి.హెచ్.ఎస్. వైద్యురాలు పి. ప్రగతి, ఎన్.సి.డి ప్రోగ్రాం ఆఫీసర్ డా.కె. నరేంద్ర కృష్ణ ,తహశీల్దారు శేషగిరి, పలువురు ఎ.ఎన్.ఎం లు, తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు

రావులపాలెం ఏప్రిల్ 23 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా రావులపాలెం డిపో నుంచి కాళేశ్వరం యాత్రకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జి.జి.వి.రమణ తెలిపారు. మే 15వ తేదీన రావులపాలెం నుంచి బయలుదేరి వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప ఆలయాల దర్శనాలతో పాటు సరస్వతీ నదిలో పుష్కర స్నానం చేసే విధంగా ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మే 17వ తేదీన బస్సు రావులపాలెం చేరుతుందని టిక్కెట్ ధర రూ.2200 అని మరిన్ని వివరాలు, అడ్వాన్స్ టికెట్ల కోసం డిపో మేనేజర్ (9959225537), అసిస్టెంట్ మేనేజర్ (7382911871), బస్ స్టేషన్ ఎంక్వైరీ (9959225549) నెంబర్లను సంప్రదించాలని డిఎం సూచించారు.

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

# జమ్మూకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు

### వెల్లడించిన భద్రతా సంస్థలు

జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నారని భద్రతా సంస్థలు వెల్లడించాయి. వారిలో అత్యధికంగా లష్కరే తయ్యిబా ముఠా సభ్యులున్నారని పేర్కొన్నాయి. భద్రతా దళాలు నిర్వహిస్తున్న రికార్డుల ఆధారంగా ఈ విషయం వెల్లడవుతోంది. వారిలో 18 మంది జైషే మహమ్మద్, 35 మంది లష్కరే ముఠాలకు చెందినవారని వాటిని బట్టి తెలుస్తోంది. ముగ్గురికి హిజ్బుల్ ముజాహిద్దీన్‌తో సంబంధం ఉందని, వారు కూడా పాకిస్థాన్‌కు చెందినవారని భద్రతా సంస్థలకు చెందిన అధికారి ఒకరు వెల్లడించారు. ఇక 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదులతో పోల్చుకుంటే ఆ సంఖ్య తక్కువగా ఉంది. ఈ విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.



కశ్మీర్‌లో కొంతకాలం నుంచి పర్యాటకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో ఉగ్రవాదులు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భద్రతా దళాలు భావిస్తున్నాయి. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని తెలుస్తోంది. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది గాలిస్తున్నారు.

కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3గంటల సమయం సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యాటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. ఘటన నేపథ్యంలో ఎన్ఐఏ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టింది. మరోవైపు ఉగ్రదాడి దృష్ట్యా దిల్లీలోనూ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదిలా ఉంటే.. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు.

## ఉగ్రదాడి నుంచి త్రుటిలో తప్పించుకున్న

# కేరళ జడ్జిలు, ఎమ్మెల్యేలు

జమ్మూకశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణహోమం ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ దాడిలో ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయాలతో బయటపడ్డారు. పర్యటన నిమిత్తం జమ్మూకశ్మీర్‌కు వెళ్లిన కేరళ హైకోర్టు న్యాయవాదులు, ఎమ్మెల్యేలు ముష్కరుల దాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఈమేరకు కేరళ ముఖ్యమంత్రి కార్యాలయం వివరాలు వెల్లడించింది.



"జమ్మూకశ్మీర్ పర్యటనకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిల్ కే నరేంద్రన్, జస్టిస్ పీజీ అజిత్ కుమార్, జస్టిస్ జి.గిరీష్.. ఎమ్మెల్యేలు ముకేశ్, కేపీఏ మజీద్, టి. సిద్ధిక్, కె.అన్నాలన్ వెళ్లారు. ఉగ్రవాదుల దాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ప్రస్తుతం శ్రీనగర్‌లో ఉన్నారు. వీరంతా సురక్షితంగా ఉన్నారు. జమ్మూకశ్మీర్‌లో చిక్కుకున్న ప్రజలను సురక్షితంగా రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం" అని ఓ ప్రకటనలో పేర్కొంది.

"ఈ ఘటనపై సీఎం పినరయి విజయన్ విచారం వ్యక్తంచేశారు. ఎర్నాంకులమ్‌కు చెందిన వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అతడి కుటుంబసభ్యులను జాగ్రత్తగా ఇంటికి చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తామని సీఎం తెలిపారు" అని సీఎంవో తెలిపింది. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో కొచ్చిలోని ఎడపల్లికి చెందిన ఎన్. రామచంద్రన్ ప్రాణాలు కోల్పోయారు. కాగా.. పహల్గాం సమీప బైసరన్ లోయలో సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు పురుషులే లక్ష్యంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

దేశవ్యాప్తంగా ఈ దాడిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఉగ్ర దాడికి ప్రతీకారం తీర్చుకోవడానికి భద్రతా దళాలు వేటను ముమ్మరం చేశాయి. ఈ దాడిలో పాల్గొన్న ముగ్గురు టెర్రరిస్టుల ఊహాచిత్రాలను దర్యాప్తు బృందాలు విడుదల చేశాయి. వీరిని ఆసిఫ్ ఫౌజి, సులేమాన్ షా, అబు తాలాగా గుర్తించారు. వీరందరూ జమ్మూకశ్మీర్ కేంద్రంగా పనిచేసే 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'లో సభ్యులుగా తేలింది. వీరిని పట్టుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

# ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలకు సిద్ధం

### తొలిసారి స్పందించిన పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. రెండు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ఆయన ఇలాంటి ప్రతిపాదన చేయడం గమనార్హం. శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో పుతిన్.. రష్యా దేశ అధికారిక వార్తా ఛానల్‌లో ఈ మేరకు చెప్పారు. ఈ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరోక్షంగా స్పందించారు. పౌరులపై దాడులు ఆపేలా కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఎలాంటి చర్చలకైనా సిద్ధమని చెప్పారు.



### లండన్‌లో చర్చలు..

యుద్ధానికి ముగింపు పలికేందుకు ఉక్రెయిన్, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికా అధికారులు బుధవారం లండన్‌లో చర్చలు జరపనున్నారు. ఈ వ్యవహారంలో ట్రంప్ సర్కారు జోక్యాన్ని కొనసాగించాలా వద్దా అన్నది నిర్ణయించడంలో ఈ భేటీ కీలకం కానుందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో స్పష్టంచేశారు. ఒకవైపు శాంతి చర్చలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు రష్యా-ఉక్రెయిన్‌లు మాత్రం దాడులను చేసుకుంటూనే ఉన్నాయి. ఈస్టర్ సందర్భంగా తాత్కాలిక కాల్పుల విరమణ పాటిస్తామని ప్రకటించిన రష్యా, దానిని అమలు చేయలేదు. తాజాగా ఉక్రెయిన్‌లోని ఒడెసా, జపోరిజియా నగరాలపై డ్రోన్లు, గ్లైడ్ బాంబులతో విరుచుకుపడింది. ఇందులో ఒక వృద్ధురాలు ప్రాణాలు కోల్పోగా.. నలుగురు చిన్నారులు సహా 27 మంది గాయపడ్డారు.

యుద్ధం ముగించేందుకు జరిపే శాంతి చర్చలు తక్షణ ఫలితాలను ఇచ్చే అవకాశం లేదని రష్యా అధ్యక్ష భవనం 'క్రెమ్లిన్' అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ప్రకటించారు. పౌర వసతులపై దాడులను ఆపాలన్న జెలెన్‌స్కీ ప్రతిపాదనపై చర్చలకు ప్రణాళికేదీ తమ వద్ద లేదన్నారు.

### వారంలో యుద్ధం ఆగిపోతుంది: ట్రంప్

మరోవైపు ఉక్రెయిన్, రష్యాల మధ్య ఈ వారంలో శాంతి ఒప్పందం కుదిరి, యుద్ధం ఆగే అవకాశాలున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో పోస్టు చేశారు. ఈ రెండు దేశాలు తమతో కలిసి భారీగా వ్యాపారం చేయబోతున్నాయన్నారు. శాంతి ఒప్పందంపై చర్చించడానికి ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ ఈ వారం రష్యాలో పర్యటించనున్నారు.

# పహల్గాం ఉగ్ర ఘటన.. ఖండించిన ప్రపంచ దేశాలు



**జమ్మూకశ్మీర్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో సాయుధ మూక పాల్పడిన అనాగరిక చర్యను ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ దీనిని హేయమైన చర్యగా అభివర్ణించారు. అమాయకులైన పౌరులపై దాడులు ఆమోదయోగ్యం కాదన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ఈ ఘటనపై స్పందిస్తూ.. పహల్గామ్‌లో జరిగిన విధ్వంసకర ఉగ్రవాద దాడి బాధితులకు సంతాపం తెలియజేశారు.**

జమ్మూకశ్మీర్‌లో పర్యటకులపై దాడి వార్త దిగ్భ్రాంతి కలిగించింది. ఇది అమానవీయ చర్య. బాధితులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాం. అన్నిరకాల ఉగ్రవాదాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. – చైనా రాయబారి జు ఫీహాంగ్

భారత ప్రభుత్వానికి, ప్రజలకు, బాధితుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నాం. గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం. ఉగ్రవాదంపై పోరాటంలో శ్రీలంక.. భారత్‌కు ఎప్పుడూ తోడుగా ఉంటుంది – శ్రీలంక విదేశాంగ మంత్రిత్వ శాఖ

పహల్గాంలో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాం. ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయెల్ భారత్‌తో కలిసి పనిచేస్తుంది" – ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహూ

పహల్గాం ఘటనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఇటువంటి అమానవీయ చర్యలు బాధాకరం. బాధిత కుటుంబాలకు, భారత్‌కు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం **– ఇటలీ ప్రధాని జార్జియా మెలోని**

పహల్గాంలో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి అమాయకుల ప్రాణాలను బలిగొంది. బాధితుల దృశ్యాలు కలిచివేస్తున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో మాల్దీవుల ప్రభుత్వం స్థిరంగా ఉంది. ఈ క్లిష్ట సమయంలో భారత్‌కు మద్దతుగా ఉంటాం.

**– మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు**

భారతదేశంలో జరిగిన ఒక దారుణమైన ఉగ్రదాడిలో డజన్ల కొద్దీ పౌరులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం.

**– ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడిని ఖండిస్తున్నాం. ఇందులో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. ఈయూ ఎప్పటికీ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటుంది.

**– ఈయూ విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి కాజా కల్లాస్**

జమ్మూలో జరిగిన క్రూరమైన దాడిని వ్యతిరేకిస్తున్నాం. అమాయక ప్రజల మరణం తీవ్రంగా కలిచివేసింది. ఈ కష్ట సమయంలో జర్మనీ భారత్ వెంట ఉంటుంది. బాధితుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. – జర్మనీ విదేశాంగ కార్యాలయం

ఈ నేరపూరిత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా భద్రత, స్థిరత్వాన్ని దెబ్బతీసే లక్ష్యంతో జరిగే అన్నిరకాల ఉగ్రవాద చర్యలను ఖండిస్తున్నాం"

– యూఏఈ విదేశాంగ మంత్రి

# సుంకాలు గణనీయంగా తగ్గుతాయ



**వాషింగ్టన్: చైనా ఉత్పత్తులపై అగ్రరాజ్యం 145 శాతం సుంకాలు విధించిన విషయం తెలిసిందే. చైనా ప్రతీకార చర్యల ఫలితంగా ఆ దేశ ఉత్పత్తులపై టారిఫ్‌లను 245 శాతం పెంచుతున్నట్లు అమెరికా ప్రకటించడంతో ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్యయుద్ధం తారస్థాయికి చేరింది. కాగా ఈ విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు.**

చైనా నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాలు గణనీయంగా తగ్గుతాయని.. కానీ సున్నా మాత్రం కావని అన్నారు. భవిష్యత్తులో చైనాతో జరగనున్న చర్చల్లో బీజింగ్‌తో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించడానికి ప్రయత్నిస్తానన్నారు. అయితే దశాబ్దాల అమెరికా వాణిజ్య విధానాన్ని దెబ్బతీసినందుకు గాను డ్రాగన్ తమతో ఏదైనా ఒక ఒప్పందానికి తప్పక అంగీకారం తెలపాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం తాము చైనాతో జరుపుతున్న వాణిజ్య చర్చలు సజావుగానే జరుగుతున్నాయని.. ఎందుకంటే ప్రతి దేశం అమెరికా మార్కెట్‌లో ఉండాలని కోరుకుంటుందన్నారు. ఆ దేశంతో తాము ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఎదురుచూస్తున్నామన్నారు. కాగా చైనాపై విధించిన సుంకాల్లో తగ్గింపులు ఉండొచ్చని ఇప్పటికే ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ సంకేతాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రపంచ దేశాలపై సుంకాల విధింపులో భాగంగా వాణిజ్యదేశాలతో పాటు ట్రంప్ చైనా పైనా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దీనికి ధీటుగా గతంలో అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకాలను విధించిన డ్రాగన్.. తాజాగా వాటిని 125 శాతానికి పెంచింది. అంతేకాకుండా అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీ విమానాల ఆర్డర్లను తీసుకోవద్దని తమ కంపెనీలను ఆదేశించడంతోపాటు కీలకమైన ఖనిజాల ఎగుమతిని నిలిపివేసింది. దీంతో ఆగ్రహించిన అగ్రరాజ్యం చైనా ఎగుమతులపై ఏకంగా 245 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించింది. కాగా ఈ తతంగమంతా ఆచరణాత్మక ప్రాముఖ్యత లేనిదని, ఈ చర్యలు దీర్ఘకాలంలో రెండు దేశాలపైనా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని చైనా పేర్కొంది.

# దిగ్భ్రాంతికి గురి చేసింది.. ఇలాంటప్పుడే ఐక్యంగా నిలవాలి

## ఉగ్రదాడిని ఖండించిన క్రికెటర్లు

పహల్గాం ఉగ్రదాడిని భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు ఖండించారు. ఇలాంటి సమయంలోనే ఐక్యంగా కలిసి ఉండాలని.. బాధ్యులు తప్పకుండా భారీ మూల్యం చెల్లించుకుంటారని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులను చుట్టుముట్టి.. అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 28 మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు.

"ఈ ఘటన గురించి తెలియగానే దిగ్భ్రాంతికి గురయ్యా. పర్యటకులపై దాడి అత్యంత దారుణం. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఇలాంటప్పుడే మనమంతా ఐక్యంగా ఉండి, మానవత్వం ప్రదర్శించాలి" - యువరాజ్ సింగ్

"ప్రతిసారీ అమాయకులే జీవితాలను కోల్పోతున్నారు. కశ్మీర్‌లో చోటుచేసుకున్న ఘటన హృదయవిదారకంగా ఉంది. కొన్ని రోజుల కిందటే అక్కడ ఉన్నా. ఈ బాధ మరింత ఎక్కువగా ఉంది" - ఇర్ఫాన్ పఠాన్

"పహల్గాం దాడి ఘటన తీవ్రంగా బాధించింది. అమాయకమైన పర్యటకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. బాధిత కుటుంబాలకు అండగా నిలుద్దాం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిద్దాం" - వీరేంద్ర సెహ్వాగ్

"ఉగ్రదాడి వార్త వినగానే నా హృదయం విరిగిపోయింది. బాధిత కుటుంబసభ్యుల గురించే నా ఆలోచన. శాంతి చేకూరాలని ఆశిస్తున్నా. దేశంలో హింసకు తావులేదు" - కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్

"బాధిత కుటుంబాల కోసం మనమంతా అండగా నిలుద్దాం.



ఎవరైతే ఈ దురాఘాతానికి బాధ్యులో వారు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారు. తప్పకుండా భారత్ స్ట్రైక్ అవుతుంది" - గౌతమ్ గంభీర్

"పహల్గాంలో ఉగ్రదాడి ఘటన తీవ్రంగా బాధించింది. బాధిత కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నా. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా. వారి కుటుంబాలు బలంగా కోలుకోవాలని ఆశిస్తున్నా. తప్పకుండా వారందరికీ న్యాయం జరగాలని కోరుకుంటున్నా" - విరాట్ కోహ్లి

"నన్ను ఈ విషయం దిగ్భ్రాంతికి గురిచేసింది. ఉగ్రదాడికి గురైన బాధితుల గురించి నా ఆలోచన. వారి కుటుంబ సభ్యులకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉంది" - హార్దిక్ పాండ్య

# పీఎస్ఎల్‌లో ఐపీఎల్ జపం

## అవార్డుల వేడుకలో పాక్ దిగ్గజం బ్లండర్ మిస్టేక్

**పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025లో భాగంగా 12వ మ్యాచ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రోల్స్ బారిన పడింది. మ్యాచ్ కంటే, ఆ మ్యాచ్‌లో చోటు చేసుకున్న తప్పుల గురించే ఎక్కువగా చర్చ జరుగుతోంది. తొలుత, ముల్తాన్ బౌలర్ వికెట్ తీసిన సంబరాల్లో తన టీంమేట్ ఉస్మాన్ ఖాన్‌ను గాయపరిచాడు. ఆ తర్వాత, అవార్డు ప్రదానోత్సవంలో, పాకిస్తాన్ మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత రమీజ్ రాజా PSL IPL అంటూ పిలిచాడు.**



పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025లో భాగంగా 12వ మ్యాచ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రోల్స్ బారిన చిక్కుకుంది. ఓ తప్పుతో పాకిస్తాన్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ముల్తాన్ సుల్తాన్స్ లాహోర్ ఖలందర్స్‌ను 33 పరుగుల తేడాతో ఓడించింది. కానీ ఈ విజయం కంటే, మ్యాచ్‌లోని తప్పుల గురించే ఎక్కువగా చర్చ జరుగుతోంది. మొదట, ముల్తాన్ బౌలర్ వికెట్ తీసిన సంబరాల్లో తన సొంత సహచరుడు ఉస్మాన్ ఖాన్‌ను గాయపరిచాడు. మ్యాచ్ తర్వాత, అవార్డు ప్రదానోత్సవంలో, పాకిస్తాన్ మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత రమీజ్ రాజా PSL %IPL% అంటూ పిలిచాడు.

మ్యాచ్ తర్వాత ప్రజెంటేషన్‌లో, బెస్ట్ క్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందిస్తూ, రమీజ్ రాజా పొరపాటున టోర్నమెంట్‌ను %ఖాలా% అని కాకుండా %ఎడీూ ఖాూ% అంటూ పిలిచాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చాలా వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా, మంగళవారం జరిగిన అత్యధిక స్కోరింగ్ మ్యాచ్‌లో లాహోర్ ఖలందర్స్‌ను ఓడించడం ద్వారా ముల్తాన్ సుల్తాన్స్ ఈ సీజన్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. కాగా, ఖలందర్స్‌కు చెందిన ఫఖర్ జమాన్‌ను అవుట్ చేసినందుకు ముల్తాన్‌కు చెందిన ఐరిష్ ఆటగాడు జోష్ లిటిల్ బెస్ట్ క్యాచ్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు.

### యాసిర్ షా అజేయ ఇన్నింగ్స్..

ఈ సీజన్‌లో తన తొలి మ్యాచ్‌లో సుల్తాన్స్ ఓపెనర్ యాసిర్ ఖాన్ 87 పరుగులతో అజేయమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత పేసర్ ఒబైద్ షా నేతృత్వంలోని బలమైన బౌలింగ్ దాడి 229 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఖలందర్స్‌ను 20 ఓవర్లలో 9 వికెట్లకు 195 పరుగులకే పరిమితం చేసింది. యాసిర్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆధారంగా, ముల్తాన్ 5 వికెట్లకు 228 పరుగులు చేసింది. %PSL% చరిత్రలో ముల్తాన్ క్రికెట్ స్టేడియంలో ఇదే అత్యధిక జట్టు స్కోరు. యాసిర్ 44 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో సహా 87 పరుగులు చేశాడు.

మొహమ్మద్ రిజ్వాన్‌తో కలిసి యాసిర్ 89 పరుగుల అద్భుతమైన ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రిజ్వాన్ 17 బంతుల్లో 32 పరుగులు చేశాడు. ఉస్మాన్ ఖాన్ 24 బంతుల్లో 39 పరుగులు, ఇఫ్తికార్ అహ్మద్ 18 బంతుల్లో 40 పరుగులు సాధించారు. లాహోర్ ఖలందర్స్ తరఫున సికందర్ రజా అత్యధికంగా అజేయంగా 50 పరుగులు చేశాడు.

# ఉప్పల్‌లో మ్యాచ్.. నల్లబ్యాడ్జిలతో ఆటగాళ్లు.. చీర్‌లీడర్స్ ఉండరు!



ఐపీఎల్ 2025 సీజన్‌లో ఉప్పల్ మైదానం వేదికగా ఇవాళ సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బాధిత కుటుంబాలకు బీసీసీఐ సంఘీభావం తెలపనుంది. ఇందులోభాగంగా ఎస్ఆర్‌హెచ్, ముంబయి ఆటగాళ్లు నల్ల బ్యాడ్జిలతో బరిలోకి దిగనున్నారు. వీరితోపాటు అంపైర్లు ధరించనున్నారు. ఈ మ్యాచ్‌లో చీర్ లీడర్స్‌కు అనుమతి లేదు. ఒక నిమిషం పాటు ప్రేక్షకులతోపాటు అందరూ మౌనం పాటించనున్నట్లు ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. 2019లోనూ ఇలాంటి పరిస్థితులే ఎదురుకాగా.. అప్పుడు కూడా 12వ సీజన్ ప్రారంభోత్సవాలను బీసీసీఐ నిర్వహించలేదు. అందుకు బదులుగా నిర్వహణకు ఖర్చు పెడదామనుకున్న డబ్బును బాధిత కుటుంబాల సంక్షేమం కోసం కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఉగ్రదాడిపై భారత్‌కు మాజీ, ప్రస్తుత క్రికెటర్లు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. తాజాగా సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్య బాధితులకు మద్దతుగా నిలిచారు. "పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం"

- సన్‌రైజర్స్ హైదరాబాద్

# సంజీవ్ గోయెంకాతో సంభాషించేందుకూ కేఎల్ అనాసక్తి? నెట్టింట చర్చ



గత సీజన్ వరకూ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను నడిపించిన సారథి కేఎల్ రాహుల్ ఈసారి దిల్లీకి మారిపోయాడు. గత సీజన్‌లో మైదానంలోనే లఖ్‌నవూ ఓనర్ సంజీవ్ గోయెంకా కేఎల్‌తో సీరియస్‌గా మాట్లాడిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. తాజాగా లఖ్‌నవూపై దిల్లీ క్యాపిటల్స్ విజయం సాధించడంలో కేఎల్ రాహుల్ కీలక పాత్ర పోషించాడు.

**దిల్లీ అలవోకగా..**

మ్యాచ్ అనంతరం ఆటగాళ్లతో కరచాలనం చేస్తుండగా సంజీవ్ గోయెంకా, ఆయన కుమారుడు శశ్వాంత్ గోయెంకా కూడా మైదానంలోనే ఉన్నారు. ఆ ఇద్దరితో షేక్‌హ్యాండ్ ఇచ్చి కేఎల్ ముందుకువెళ్లేందుకు సిద్ధమయ్యాడు. సంజీవ్ మాత్రం కేఎల్‌ను ఆపేందుకు ప్రయత్నించారు. కానీ, రాహుల్ మాత్రం వారితో మాట్లాడేందుకు ఆసక్తి చూపించలేదు. అదేవిధంగా శశ్వాంత్‌తోనూ వ్యవహరించాడు. దీంతో సోషల్ మీడియాలో ఒక్కసారిగా చర్చకు దారితీసింది. గతేడాది సంజీవ్ గోయెంకా కేఎల్ రాహుల్‌పై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తంచేసిన మాటలను మరోసారి అభిమానులు గుర్తుచేశారు. మెగా వేలానికి ముందు కేఎల్ కూడా ఘాటుగానే స్పందించిన సంగతి తెలిసిందే.

"గెలవాలనే మనస్తత్వం ఉండాలి. వ్యక్తిగత లక్ష్యాలు, ఆకాంక్షల కంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమనేవారితోనే కలిసి వెళ్లడం బాగుంటుంది. అలాంటివారినే రిటైన్ చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తాం" అని సంజీవ్ వ్యాఖ్యానించారు. దానికి కేఎల్ స్పందిస్తూ "వారు ఈ నిర్ణయం ముందే తీసుకున్నారు. మేనేజ్‌మెంట్ ఏమన్నదో తెలియదు. ఇకనుంచి నా ప్రయాణం కొత్తగా మొదలుపెడతా. నాకున్న ఆప్షన్లను బయటపెడతా. నాకు పూర్తిస్థాయిలో స్వేచ్ఛ లభించే వాతావరణం ఉన్న దగ్గర ఆడతా. ఐపీఎల్‌లో ఒత్తిడి చాలా ఉంటుంది" అని పేర్కొన్నాడు.



# ఓటీటీలోకి వచ్చేసిన మసూద మూవీ

టాలీవుడ్ యువ నటులు సంగీత, తిరువీర్, కావ్య కళ్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ హిట్ చిత్రం మసూద. హారర్ థ్రిల్లర్‌గా వచ్చిన ఈ చిత్రాన్ని స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా నిర్మించగా సాయి కిరణ్ దర్శకత్వం వహించాడు. నవంబర్ 18 2022న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్‌ను అందుకుంది. అయితే ఈ సినిమా ప్రస్తుతం తెలుగు ఓటీటీ వేదిక ఆహాలో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తెలుగులో మాత్రమే ఈ సినిమా అందుబాటులో ఉండడంతో వేరే భాష ప్రేక్షకులకు రీచ్ కాలేకపోయింది. అయితే ఈ మూవీ వచ్చిన దాదాపు 3 ఏండ్ల తర్వాత మరో ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది ఈ చిత్రం. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియలో ఈ చిత్రం ప్రస్తుతం తెలుగుతో పాటు ఇతర భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.

**కథ విషయానికి వస్తే**

నీలం (సంగీత) ఒక ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పనిచేస్తూ, భర్త అబ్దుల్ (సత్య ప్రకాశ్) నుంచి విడిపోయి, తన కూతురు నాజియా (బాంధవి శ్రీధర్)తో కలిసి ఒక అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటుంది. అదే అపార్ట్‌మెంట్‌లో నివసించే గోపీ (తిరువీర్) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అతను తన సహోద్యోగి మినీ (కావ్యా కళ్యాణ్ రామ్)ను ప్రేమిస్తాడు, కానీ ఆ విషయాన్ని ఆమెతో చెప్పడానికి భయపడతాడు. ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉండడం వల్ల గోపీ, నీలం కుటుంబంతో సన్నిహితంగా మెలుగుతాడు. అప్పుడప్పుడు నీలం, నాజియాతో కలిసి గోపీ బయటకు వెళ్తుంటాడు. ఒక రోజు నాజియా విచిత్రంగా ప్రవర్తించడం మొదలుపెడుతుంది. అర్ధరాత్రి వేళ ఏవో వింత మాటలు మాట్లాడుతుంది. కూతురి పరిస్థితిని చూసి భయపడిన నీలం, గోపీ సహాయం కోరుతుంది. నాజియా ప్రవర్తనను గమనించిన గోపీ, ఆమెకు దెయ్యం పట్టి ఉంటుందని అనుమానిస్తాడు. ఆమెను రక్షించడానికి వారు అనేక ప్రయత్నాలు చేస్తారు. చివరకు అల్లా ఉద్దీన్ (సత్యం రాజేశ్) సలహాతో పీర్ బాబా (శుభలేఖ సుధాకర్)ను సంప్రదిస్తారు. ఈ తర్వాత గోపీ, నీలంలకు ఎదురైన సవాళ్లు ఏమిటి? నాజియా శరీరంలోకి దెయ్యం ఎలా ప్రవేశించింది? మసూద ఎవరు, ఆమె నేపథ్యం ఏమిటి? మసూదను మీర్ చాచా ఎందుకు చంపాడు? నాజియాను కాపాడేందుకు గోపీ చేసిన సాహసం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలంటే,'మసూద' సినిమా చూడాల్సిందే.

**విశ్లేషణజి**

హార్రర్ సినిమాలు అంటే ఎక్కువగా హిందూ సంప్రదాయం నేపథ్యంలో ఉంటాయి. 'మసూద'లో డిఫరెన్స్ ఏంటంటే కథంతా ముస్లిం నేపథ్యంలో సాగుతుంది. ఆత్మలను వదిలించడానికి సాధువులు, అఘోరాలు పూజలు చేయడం హార్రర్ సినిమాల్లో చూసుంటాం. 'అరుంధతి'లో షాయాజీ షిండే రోల్ తావీదులు కట్టినా అందులోనూ హిందూ పూజలు ఎక్కువ. కానీ, 'మసూద' అంతా ముస్లిం నేపథ్యంలో సాగడంతో పీర్ బాబాలు ఆత్మలను వదిలించడానికి ఇస్లాం నేపథ్యంలో పూజలు చేయడం, మసీదులో మంత్రించిన కత్తితో దెయ్యాన్ని అంతం చేయడానికి చూపించడం వంటివి ఉంటాయి.'మసూద'లో ముస్లిం నేపథ్యం సన్నివేశాలను తెరకెక్కించిన తీరు కొంచెం కొత్తగా ఉంటుంది. కథ విషయానికి వస్తే ఆ కొత్తదనం తక్కువ. కథను నడిపించిన తీరు కూడా సాధారణంగా ఉంటుంది. ప్రథమార్ధంలో దర్శకుడు పాత్రలను పరిచయం చేయడానికి మాత్రమే వాడుకున్నారు. దాంతో కథ ముందుకు కదలదని ఫీలింగ్ ఉంటుంది. నిడివి ఎక్కువైనా కొన్ని సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. విశ్రాంతి తర్వాత అసలు కథ మొదలైంది. కథ సాధారణంగా అనిపించినా సన్నివేశాలు బావున్నాయి. చివరి అరగంట ఉత్కంఠ కలిగిస్తుంది. అందుకు ఛాయాగ్రహణం, సంగీతం ప్రధాన కారణమని చెప్పాలి. ఏదో జరుగబోతుందనే ఉత్కంఠను అలా కొనసాగించారు.

# ఓటీటీలోకి వచ్చిన అషురెడ్డి సిరీస్

**అషు రెడ్డి ప్రధాన పాత్రలో 'ఎవరు ఎప్పుడు ఎక్కడ' వెబ్**



**సిరీస్ - ఓటీటీలో నేరుగా విడుదల**

ప్రస్తుతం ఓటీటీ వేదికలు విభిన్నమైన కంటెంట్‌తో నిండిపోయాయి. సినిమా థియేటర్స్‌కు వెళ్లకుండా ఇంట్లోనే హైక్వాలిటీ ఎంటర్‌టైన్‌మెంట్ ఆస్వాదించాలనుకునే వారికి వెబ్ సిరీస్‌లు సరికొత్త ప్రపంచాన్ని తెరలేపాయి. అందుకే, ప్రతీ రోజు కొత్తగా కొన్ని వెబ్ సిరీస్‌లు ప్రదర్శనకు వస్తున్నాయి. ఈ క్రమంలో, సోషల్ మీడియాలో తన ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అషు రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన తాజా వెబ్ సిరీస్ 'ఎవరు ఎప్పుడు ఎక్కడ' నెమ్మదిగా, కానీ విశేషంగా ప్రేక్షకులను ఆకర్షించుతుంది.

**మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా 'ఎవరు ఎప్పుడు ఎక్కడ'**

పీఎస్ రావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ ఒక మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ గా రూపొందింది. కథ ప్రారంభమే ఉత్కంఠగా ఉంటుంది. ఓ ఎమ్మెల్యే వద్ద పీఏగా పనిచేసే వ్యక్తి అనుమానాస్పద రీతిలో మరణిస్తాడు. ఈ ఘటనను ఓ సాధారణ ప్రమాదంగా పరిగణించకుండా, పోలీసులు దర్యాప్తు ప్రారంభిస్తారు. అయితే దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ, ఈ కేసుతో సంబంధం ఉన్న కీలకమైన సాక్షులు కూడా ఒకదాని తర్వాత ఒకటి హత్య చేయబడుతుంటారు. వరుసగా జరుగుతున్న హత్యల వెనుక అసలు కథ ఏమిటి? ఈ మిస్టరీని ఛేదించే ప్రయత్నం కథను ఆసక్తికర మలుపులకు దారి తీస్తుంది.

**అషు రెడ్డి, ధన్య బాలకృష్ణ, కౌశల్ మందా నటన ప్రధాన ఆకర్షణ**

ఈ సిరీస్‌లో అషు రెడ్డి తన పాత్రలో న్యాయంగా నటించి, ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఆమె క్యారెక్టర్‌కు అవసరమైన భావోద్వేగాలను బాగా ప్రదర్శించింది. ధన్య బాలకృష్ణ, కౌశల్ మందా, ఆటో రాంప్రసాద్ తదితరులు తమ తమ పాత్రల్లో మంచి నటనను ప్రదర్శించారు. ముఖ్యంగా, ఆటో రాంప్రసాద్ హాస్యంతో కూడిన సన్నివేశాలు కథలోకి స్వల్ప విశ్రాంతి తీసుకొచ్చాయి. హంగామా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో తెలుగు మరియు హిందీ భాషలలో ఈ సిరీస్ అందుబాటులో ఉండటం విశేషం. దీంతో విభిన్న భాషాభిమాని ప్రేక్షకులు కూడా దీన్ని ఆస్వాదించగలుగుతున్నారు.

**కథలో మలుపులు, ట్విస్టులతో ఆసక్తికర అనుభూతి**

'ఎవరు ఎప్పుడు ఎక్కడ' కథా నిర్మాణం ఎంతో బలంగా ఉంది. ఒక చిన్న హత్య కేసు నుంచి మొదలై, అది ఎలా పెద్ద కుట్రగా మారుతుందో దర్శకుడు చక్కగా చూపించాడు. ప్రతి ఎపిసోడ్ ముగింపు ఒక కొత్త మిస్టరీని ప్రేక్షకుల ముందుకు తెస్తుంది. చివరి వరకు ప్రేక్షకుల్లో ఆసక్తిని, ఉత్కంఠను కొనసాగిస్తూ, థ్రిల్లర్ భావాన్ని నిలిపి ఉంచడంలో టీం సఫలమయ్యారు. క్రైమ్, మిస్టరీ, థ్రిల్లర్ జానర్‌కు అభిమానులైతే, ఈ సిరీస్ తప్పకుండా ఒక మంచి ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది.

**ఓటీటీలో కొత్త ప్రయోగాలకు ఓ మచ్చుతునుకే!**

ప్రపంచవ్యాప్తంగా ఓటీటీ మార్కెట్ విస్తరిస్తున్న నేపథ్యంలో, చిన్న బడ్జెట్ చిత్రాలు, వెబ్ సిరీస్‌లకు మంచి అవకాశాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో, 'ఎవరు ఎప్పుడు ఎక్కడ' వంటి చిన్న ప్రయోగాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాయి. గ్లామర్ మాత్రమే కాదు, కథకి ప్రధాన ప్రాధాన్యం ఇచ్చి రూపొందించిన ఈ సిరీస్ ఓ మంచి ట్రెండ్ సెట్టర్ గా నిలవనుంది.

# 'ప్రణయం 1947' సినిమా రివ్యూ!

**సహజత్వానికి దగ్గరగా మలయాళ చిత్రాలు**

ఇప్పటి సినిమాల పరుగులో మలయాళ సినిమా పరిశ్రమ మాత్రం తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది. తక్కువ బడ్జెట్‌తో, సహజతను నాటకీయతలో మిక్స్ చేయకుండా, జీవన సత్యాన్ని ప్రతిబింబించే కథల్ని చెబుతోంది. అలాంటి విలువైన చిత్రాల్లో "ప్రణయం 1947" మరో మణికట్టు. అభిషేక్ అశోకన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, ప్రేక్షకుల హృదయాల్లో భావోద్వేగ అలజడులు పుట్టించేలా సాగుతోంది. "జననం 1947 ప్రణయం తుదారున్ను" పేరుతో మొదలైన ఈ ప్రయాణం, ఇప్పుడు "ప్రణయం 1947" అనే టైటిల్‌తో స్ట్రీమింగ్ లో అందుబాటులోకి వచ్చింది. ఒక మారుమూల గ్రామం. అక్కడ 70 సంవత్సరాల వృద్ధుడు శివన్ తన జీవితాన్ని ఒంటరిగా సాగిస్తూ ఉన్నాడు. భార్య మరణించిన తరువాత, పిల్లలు దూరమైన తరువాత, తన పొలాల మధ్య నిర్మించుకున్న చిన్న ఇంటిలో జీవనం కొనసాగిస్తున్నాడు. పొలం పనులు చేస్తూ, సమీపంలోని వృద్ధాశ్రమంలో కొద్దిసేపు పనిచేస్తూ రోజులు గడుపుతున్నాడు. అలా అతడి జీవితం కాస్త నిష్ఫలంగా సాగుతున్నప్పుడు, వృద్ధాశ్రమంలో ఉంటున్న గౌరీని కలుస్తాడు. గతంలో టీచర్‌గా పని చేసిన గౌరీను తన కొడుకు అక్కడ వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. యితే సొంత ఇంటిపై ఆమె బెంగపెట్టుకుని భారంగా రోజులు గడుపుతూ ఉంటుంది. ఆమె ఆవేదనను అర్థం చేసుకున్న శివన్, తనతో కలిసి బ్రతకాలనుకుంటే తనకి అభ్యంతరం లేదని చెబుతాడు. కొడుకుల అనుమతి తీసుకుని, ఇద్దరూ పెళ్లి చేసుకుంటారు. కొత్తగా ఏర్పడిన ఈ బంధం, శివన్‌కు తిరిగి జీవితం తీసుకొస్తుంది. గౌరీకి కూడా పొలాల మధ్య ఉన్న ఇంటి ప్రశాంతత అమితమైన ఆనందాన్ని కలిగిస్తుంది. కానీ ఈ ప్రశాంతత ఎక్కువ రోజులు నిలబడదు. శివన్ చిన్న కొడుకు రఘు, ఆర్థిక సమస్యలతో ఇంటి డాక్యుమెంట్లు తాకట్టు పెట్టాలని డిమాండ్ చేస్తాడు. అక్కడి నుంచి కథ మరో మలుపు తిరుగుతుంది. పాత బాధలు, నూతన సంబంధాలు ఎదుర్కొనే సవాళ్లు కలిపి సినిమా ఆసక్తికరంగా మారుతుంది.

**భావోద్వేగాల పరిపుష్టి**

"ప్రణయం 1947" ఒక సినిమా కాదు, అనుభూతి. జీవితం




నడిచే మార్గంలో ఒంటరితనాన్ని ఓడించడానికి, మానవత్వాన్ని నిలబెట్టడానికి ప్రయత్నించే మనసుల కథ ఇది. పిల్లల కోసం జీవితాన్ని త్యాగం చేసిన తల్లి తండ్రులు, చివరికి ఒంటరిగా మిగిలిపోవడం ం ఈ మిన్ను నిజాన్ని ఎంతో చక్కగా చిత్రీకరించారు. జీవితంలో ప్రేమకి, అనురాగానికి వయసుతో సంబంధం లేదు అని చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశం మనస్సుని తాకుతుంది. జీవితపు చివర్లో కూడా ఒకరికొకరు తోడుగా ఉండాలన్న చిన్న ఆశ, ఈ కథను ప్రత్యేకంగా నిలబెడుతుంది.

**సాంకేతికత పరంగా ప్రత్యేకత**

సంతోష్ చేపట్టిన సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి అసలు ప్రాణం. పల్లె అందాలను, నిసర్గ సౌందర్యాన్ని అద్భుతంగా ఫ్రేమ్ చేశారు. గోవింద్ వసంత అందించిన నేపథ్య సంగీతం భావోద్వేగాలకు మరింత బలాన్నిస్తోంది. కిరణ్ దాస్ ఎడిటింగ్ కూడా సీన్స్‌ను స్నేహపూర్వకంగా, సహజంగా కట్ చేసి, సినిమా ప్రవాహాన్ని పటిష్ఠంగా నిలబెట్టాడు. సాదా సీన్?లను కూడా భావావేశంతో నింపగలగడం దర్శకుడి గొప్పతనం. తక్కువ బడ్జెట్‌లో గొప్ప ఫలితాన్ని అందించిన సినిమా ఇది.

**ముగింపు ం మనస్సుని తాకే సందేశం**

"నీవాళ్లు నిన్ను అర్థం చేసుకుంటారు" అనే భ్రమను వీడిచి, నిన్ను అర్థం చేసుకున్న వారే నీ నిజమైన వారు అన్న స్పష్టమైన సందేశాన్ని ఈ సినిమా మధురంగా అందిస్తుంది. జీవితాన్ని నడిపించే బంధాలు ఒక్కసారి విరిగినా, మనసులు మాత్రం తిరిగి కలవొచ్చునని చెప్పే ఈ గాథ, ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు భావోద్వేగ చిత్రాలను ప్రేమించే వారికి తప్పకుండా నచ్చుతుంది.

# పథకం ప్రకారమే నటి జాత్వాని అరెస్ట్

## -పీఎస్ఆర్ రిమాండ్ రిపోర్ట్‌లో విస్తుపోయే వాస్తవాలు

నటి జెత్వాని కేసులో అరెస్ట్ అయిన ఇంటెలిజెన్స్ మాజీ బాస్ పీఎస్ఆర్ ఆంజనేయులు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముంబై నటి జెత్వాని కేసులో ఆమె, ఆమె తల్లిదండ్రులను పథకం ప్రకారమే ఆంజనేయులు అరెస్ట్ చేయించారని పోలీసులు తెలిపారు. ఆయన అప్పటిలో ఇంటెలిజెన్స్ బాస్‌గా ఉండటంతో ఆయన ఆదేశాలు మేరకే అక్రమ అరెస్టులు జరిగాయని, ముందుగా నిర్ణయించిన ప్రణాళిక ప్రకారమే ఈ అక్రమ అరెస్టులు జరిగాయని వెల్లడించారు. ఇందుకు సంబంధించి పీఎస్ఆర్ ఆంజనేయులు, అప్పటి సీపీ కాంతి రాణా తాతా, విశాల్ గున్ని కాల్ రికార్డ్ డేటా కూడా స్పష్టంగా ఉందన్నారు. 2024 జనవరి 30 నుంచి 2024 ఫిబ్రవరి 3 వరకు వీరి ముగ్గురి కాల్ డేటా కూడా సేకరించినట్లు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ తెలిపారు. పీఎస్ఆర్ ఆంజనేయులు ముంబై పోలీస్ అధికారులతో కూడా ఆ సమయంలో టచ్‌లో ఉన్నారని తేలిందన్నారు. ముందుగా నిర్ణయించడం వల్లే అసలు జెత్వానీపై కేసు రిజిస్టర్ చేయకముందే అంటే రెండు రోజులు ముందు ముంబై ఫ్లైట్ టికెట్స్ కొన్నారన్నారు. అసలు కుక్కల విద్యాసాగర్ ముంబై నటి జెత్వానీపై చేసిన ఫిర్యాదులో కూడా నిజం లేదని తేలిందని పోలీసులు పేర్కొన్నారు. దీనికి సంబంధించి న్యాయమూర్తి ముందు ఇచ్చిన 164 వాంగ్మూలం కూడా ఉన్నాయన్నారు. పైగా తనను విశాల్ గున్ని ఇచ్చిన స్టేట్మెంట్‌ను కూడా రిమాండ్ రిపోర్ట్‌లో దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. తనని పీఎస్ఆర్ ఆంజనేయులు సీఎంవోకు పిలిపించి జెత్వానీని అరెస్ట్ చేసే టాస్క్ అప్పగించారని విశాల్ గున్ని చెప్పారు. తనకు అసలు ఈ కేసుతో సంబంధం లేకపోయినప్పటికీ టాస్క్ అప్పగించారని విశాల్ గున్ని చెప్పారు. తాను ఈ టాస్క్ పూర్తి చేస్తేనే తనను విశాఖకు రిలీవ్ చేస్తామని చెప్పారని కూడా వివరించారు. అప్పటి ఇంటెలిజెన్స్ బాస్‌గా ఉండటం, తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఈ అక్రమ అరెస్ట్ చేయించారని, ఒక మహిళ వ్యక్తిగత స్వేచ్ఛ ను హరించారని, అప్పటి డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి కూడా ఈ విషయం అప్పటి సీపీ కాంతి రాణా తాతా చెప్పారని, ఆయన గో ఎహెడ్ అన్నారని రిమాండ్ రిపోర్ట్‌లో తెలిపారు. పీఎస్ఆర్ ఆంజనేయులు అసలు విచారణకు సహకరించలేదని, ఆయన వద్ద నుంచి ఐఫోన్‌ను సీజ్ చేశామన్నారు. ఆయనను విచారించేందుకు మళ్ళీ కస్టడీకి కూడా తీసుకోవాల్సి ఉందని రిమాండ్ రిపోర్ట్‌లో పేర్కొన్నారు.

ఋ/-//-



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339